జాతీయ తెలుగు దినపత్రిక

ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



రంగారెడ్డి | గురువారం 19 నవంబర్ 2026 | సంపుటి : 17 | సంచిక : 117 | పేజీలు : 8 | వెల : 1/- | RNI NO.APTEL/2010/36516

శ్రీ పరాభవ నామ సంవత్సరం, మాసం : జ్యేష్ఠ మాసం, గ్రీష్మ ఋతువు, ఉత్తరాయణం, సూర్య చంద్రుల సమయాలు సూర్యోదయం : 5:28 , సూర్యాస్తమయం : 6:32 , చంద్రోదయం : 3:38 చంద్రాస్తమయం : 3:07 పంచాంగం, తిథి : శుద్ధ ద్వాదశి రా. 10:31 వరకు, తర్వాత త్రయోదశి, నక్షత్రం: విశాఖ రా. 8:10 వరకు, తర్వాత అనూరాధ, యోగం : సిద్ధం మ. 1:19 వరకు, తర్వాత సాధ్యం, కరణం: బవ ఉ. 9:47 వరకు, తర్వాత బాలవ రా. 10:31 వరకు, తర్వాత కౌలవ

Published From RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA | http://www.prajajyothinews.com | Mail : prajajyothidaily@gmail.com

పెన్షన్ పత్రాల కోసం 8 గంటల నిరీక్షణ

ఆకలితో అరటిపండ్లే ఆధారం!



వృద్ధులు,వితంతువులు, దివ్యాంగులకు కనీస భోజన సదుపాయం కరువు..

ఎమ్మెల్యే రాక కోసం గంటల తరబడి ఎదురుచూపులు!



పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే ప్రభుత్వ లక్ష్యం..



పథకాలు పేదల గడపకు చేరితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది...

నిధులు, పథకాలు తెచ్చే బాధ్యత నాది.. అమలు బాధ్యత అధికారులది...

ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి...

కొంగరకలాన్ ఆదిభట్లలో నూతన పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం...

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో చేయూత పెన్షన్ పథకం ద్వారా 4,392 మంది

లబ్ధిదారులకు పెన్షన్ ప్రొసీడింగ్స్ ను అందచేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్



తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు చేపట్టాలి...

అధికారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాలు...

తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష....

సమీక్షకు హాజరైన ఈఎన్సీ కృపాకర్ రెడ్డి...

ఇబ్బందులు తలెత్తే పరిస్థితిలేదని అధికారుల వెల్లడి...

నీటి కొరత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచనలు...

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా రక్షణ.!

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా

జీవిత భీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి



ఇబ్రహీంపట్నం నవంబర్ 18 ప్రజాజ్యోతి: ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, కుటుంబాల ఆర్థిక భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. ఈ నెల 19వ తేదీ గురువారం నాడు సిద్దిపేట జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే ప్రభుత్వ లక్ష్యం..

పథకాలు పేదల గడపకు చేరితేనే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుంది...
నిధులు, పథకాలు తెచ్చే బాధ్యత నాది.. అమలు బాధ్యత అధికారులది...
ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి...
కొంగరకలాన్ ఆదిభట్లలో నూతన పెన్షన్ పత్రాల పంపిణీ కార్యక్రమం...





ఇబ్రహీంపట్నం నవంబర్ 18 ప్రజాజ్యోతి: పేదల సంక్షేమమే లక్ష్యంగా అమలుచేస్తున్న పథకాలు వారి గడపకు చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మన్నెగూడలోని 'జేఎంఆర్ గార్డెన్స్'లో ఆదిభట్ల, కొంగరకలాన్, తుర్కయంజాల్, తొర్రూర్ డివిజన్ లకు సంబంధించిన లబ్ధిదారులకు నూతన చేయూత పెన్షన్ పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం, పెద్దఅంబర్‌పేట్‌లోని 'తారా కన్వెన్షన్'లో కుంట్లూరు, పెద్దఅంబర్‌పేట్ డివిజన్లతో పాటు అబ్దుల్లాపూర్‌మెట్ మండలానికి చెందిన లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను మల్‌రెడ్డి అందజేశారు. పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే ప్రభుత్వ లక్ష్యం... పేదల జీవితాల్లో వెలుగులు నింపటమే లక్ష్యంగా ప్రజాప్రభుత్వం పనిచేస్తోందని మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా అమలుచేస్తున్న ప్రతీపథకం పేదల గడపకు చేరినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని చెప్పారు. పదిహేనేళ్ల క్రితం తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు జరిగిన అభివృద్ధి మినహాయిస్తే, అనంతరం ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోకుండా పోయిందన్నారు. ఇళ్లు, పెన్షన్లు అందని దుస్థితి ఉండేదన్నారు. ప్రజాప్రభుత్వం వచ్చాక ఇళ్లు, పెన్షన్లు, సన్నబియ్యం, ఉచిత కరెంటులాంటి అనేక పథకాలను అమలుచేస్తున్నామని చెప్పారు. పెన్షన్లు రాలేదనే మాట ప్రజల నుంచి వినిపించవద్దని ఎమ్మెల్యే అన్నారు. దరఖాస్తు చేసుకున్న వారందరికీ మంజూరు చేయించే బాధ్యత తనదన్న మల్‌రెడ్డి... ప్రతీఒక్కరికీ అందుబాటులో ఉండి, వారి గడపకు చేర్చాల్సిన బాధ్యత మాత్రం అధికారులేదనన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక విషం చిమ్ముతున్న వారికి ప్రజాకోర్టులో శిక్ష తప్పదని మల్‌రెడ్డి రంగారెడ్డి హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి, ఆదిభట్ల డిసి సత్యనారాయణ రెడ్డి, గడ్డిఅన్నారం ఏఎంసి చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ఉప్పరిగూడ పిఎసిఎస్ చైర్మన్ ఏదుల పాండురంగారెడ్డి, మాజీ జెడ్పిటిసి భూపతిగళ్ల మహిపాల్, ఏఎంసి వైస్ చైర్మన్ భాస్కరాచారి, ఆదిభట్ల డివిజన్ అధ్యక్షులు పల్లె రజనీకాంత్ గౌడ్, ముత్యాల రాజశేఖరరావు, కొశికె ఐలయ్య, గుండ్లపల్లి ధనరాజ్ గౌడ్, అధికారులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై ముందస్తు చర్యలు చేపట్టాలి...





అధికారులకు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి ఆదేశాలు...
తాగునీటి సరఫరాపై ఆర్‌డబ్ల్యూఎస్, మిషన్ భగీరథ అధికారులతో సమీక్ష....
సమీక్షకు హాజరైన ఈఎన్సీ కృపాకర్ రెడ్డి...
ఇబ్బందులు తలెత్తే పరిస్థితిలేదని అధికారుల వెల్లడి...
నీటి కొరత దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచనలు...

ఇబ్రహీంపట్నం నవంబర్ 18 ప్రజాజ్యోతి: రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం, నీటి ఎద్దడి దృష్ట్యా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మంగళవారం సాయంత్రం గ్రామీణ నీటి సరఫరా (ఆర్‌డబ్ల్యూఎస్), మిషన్ భగీరథ శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. రాత్రి వరకు కొనసాగిన ఈ సమావేశానికి ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్సీ కృపాకర్ రెడ్డి హాజరయ్యారు. నియోజకవర్గంలోని వివిధ డివిజన్లు, మండలాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు రాకూడదని స్పష్టం...

ఈ సందర్భంగా నియోజకవర్గంలో ప్రస్తుత తాగునీటి సరఫరా పరిస్థితిని ఎమ్మెల్యే సమీక్షించారు. కొన్ని గ్రామాలకు సక్రమంగా నీరు అందకపోవడంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా దండుమైలారం, ఆరుట్ల తదితర ప్రాంతాల్లో సమస్యల గురించి ఆరా తీశారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని అధికారులు వివరించారు. వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు ఎదురుకాకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. నీటి సరఫరా పైపులైన్లలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నా, నిర్వహణలోపాలు ఉన్నా వెంటనే గుర్తించి మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ప్రతి గ్రామానికి సరిపడా తాగునీరు అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించాలని స్పష్టం చేశారు. అవసరమైతే తాగునీటి సమస్యల పరిష్కారం కోసం సంబంధిత మంత్రితో మాట్లాడేందుకు కూడా సిద్ధంగా ఉన్నానని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రజల నుంచి ఎట్టి పరిస్థితుల్లోనూ ఫిర్యాదులు రాకూడదని స్పష్టం చేశారు.

నియోజకవర్గంలో నీటి సమస్య రాకుండా ఏర్పాట్లు..

ఈఎన్సీ కృపాకర్ రెడ్డి మాట్లాడుతూ... ఇబ్రహీంపట్నం నియోజకవర్గవ్యాప్తంగా ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. నీటి సరఫరాలో ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే ప్రజలు టోల్‌ఫ్రీ నంబర్ '1916'కు నేరుగా ప్రజలు ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. ఈ అవకాశంతో తాగునీటి సరఫరాలో సమస్యలు, నీటి ఎద్దడి లేదా సరఫరాలో అంతరాయాలు ఏర్పడితే ప్రజలు తమ వాయిస్ ద్వారా ఫిర్యాదు నమోదు చేయవచ్చని వివరించారు. సమస్య పరిష్కారమైందని ఫిర్యాదుదారులు తిరిగి ధ్రువీకరించే వరకు ఆ ఫిర్యాదు వ్యవస్థలో కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఏఎంసీ చైర్మన్ గురునాథరెడ్డి కౌన్సిలర్లు ఇందూరి శ్రీనివాస్, నీళ్ల భానుగౌడ్, దారు రాఘవేందర్, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా రక్షణ.!

ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా
జీవిత భీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి
రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి

ఇబ్రహీంపట్నం నవంబర్ 18 ప్రజాజ్యోతి: ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం, కుటుంబాల ఆర్థిక భద్రతకు పెద్దపీట వేస్తూ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని జిల్లాలోని ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి సూచించారు. ఈ నెల 19వ తేదీ గురువారం నాడు సిద్దిపేట జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకాన్ని ప్రారంభిస్తారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ పథకం ద్వారా ప్రతి కుటుంబానికి రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ కల్పించడం ద్వారా కుటుంబాలకు ఆర్థిక భరోసా అందించాలన్నది రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఒక ప్రకటనలో తెలిపారు. కుటుంబంలోని సంపాదించే వ్యక్తి మరణిస్తే ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులకు గురికాకుండా రూ.5 లక్షల జీవిత బీమా రక్షణ ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడంతో పాటు, విపత్కర పరిస్థితుల్లో బాధిత కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోందని వివరించారు. 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సు కలిగిన ప్రతి ఒక్కరూ అనగా (ూౠా: ాూఎశీజవ జూశీజవతీఎ శ్రీవజవశ్రీ, ధీూ: దీవశ్రీశీష ూశీజవతీఎ ూవజవశ్రీ) ఇందిరమ్మ కుటుంబ జీవిత భీమా పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులని కలెక్టర్ తెలిపారు. ఈ పథకాన్ని అందరు సద్వినియోగపరుచుకోవాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలోని అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ పథకంపై అవగాహన కల్పించేందుకు సంబంధిత గ్రామస్థాయి నుండి జిల్లాస్థాయి అధికారుల వరకు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజలకు ఈ పథకం ఉద్దేశాలు, ప్రయోజనాలు, అర్హత ప్రమాణాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రజలకు పథకంపై ఎలాంటి సందేహాలు ఉన్నా వాటిని నివృత్తి చేస్తూ, పథకం వివరాలు ప్రజలకు చేరేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న ఈ బృహత్తర పథకం ద్వారా అందించే రూ.5 లక్షల జీవిత బీమా రక్షణను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని తమ కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించుకోవాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఈ సందర్భంగా కోరారు.



పాఠశాల అభివృద్ధికి అందరు సహకరించారు

ప్రిన్సిపల్ మంజుల వేమారెడ్డి



నందిగామ, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): కొత్తూరు మండల పరిధిలోని ఇన్ముల్ నర్వ గ్రామంలో వెంకటేశ్వర హై స్కూల్ లో అభివృద్ధి బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మంజుల వేమారెడ్డి మాట్లాడుతూ బడి అంటే కేవలం చదువు చెప్పే చోటు కాదు బిడ్డల భవిష్యత్తును తీర్చిదిద్దే గుడి ఈ గుడిని కాపాడుకోవడం మన అందరూ బాధ్యత ఒక్క బిడ్డ కూడా చదువు మానేయకూడదు తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజు బడికి పంపాలని ఆయన పిలుపునిచ్చారు. బడిబాట కార్యక్రమం విజయవంతం చేసి విద్యార్థులకు నాయకులకు అధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

భూపతి చంద్ర స్మారక కథానికల పోటీకి రచనల ఆహ్వానం

హైదరాబాద్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) : భూపతి చంద్ర మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ-2027కు రచయితలు, రచయిత్రుల నుంచి కథానికలను ఆహ్వానిస్తున్నట్లు ట్రస్ట్ అధ్యక్షుడు ఎం.ఎల్.కాంతారావు తెలిపారు. సమకాలీన సామాజిక సమస్యలు, మానవీయ విలువలు, వైవిధ్యమైన అంశాలతో కూడిన కథానికలకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. ఈ పోటీలో ప్రథమ బహుమతిగా రూ.20 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15 వేలు, తృతీయ బహుమతిగా రూ.10 వేలు అందజేయనున్నారు. అదేవిధంగా ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున ప్రోత్సాహక బహుమతులు ప్రకటించారు. పోటీకి పంపే కథానికలు ఏ4 సైజులో డీటీపీ లేదా వర్డ్ ఫైల్ రూపంలో నాలుగు పేజీలకు మించకుండా ఉండాలి. గతంలో ఏ పత్రికలోనూ ప్రచురితం కాని స్వీయ రచనలనే పంపాలి. కథానిక అనువాదం, అనుసరణ లేదా అనుకరణ కాదని, ఎక్కడా ప్రచురితం కాలేదని, ఇతర పరిశీలనలో లేదని హామీ పత్రం జతచేయాలి. కథానిక ప్రతులపై రచయిత పేరు ఉండకూడదు. కథ పేరుతో పాటు కలం పేరు, స్వంత పేరు, పూర్తి చిరునామా, ఫోన్ నంబర్‌ను ప్రత్యేకంగా జతచేయాలి. ఒక్కొక్కరు ఒక కథానిక మాత్రమే పంపేందుకు అర్హులు. కథానికలు పంపేందుకు చివరి తేదీ 2026 డిసెంబర్ 25గా నిర్ణయించారు. ఆసక్తి గలవారు ఎఎఎుత్ష్ముఎస్త్రఘఅశ్రీ.ఔశీఎ ఈమెయిల్ ద్వారా, 9793059793 వాట్సాప్ నంబర్‌కు లేదా పోస్టు, కొరియర్ ద్వారా పంపవచ్చు. పోస్టు ద్వారా పంపాల్సిన చిరునామా: సమన్వయకర్త, 'భూపతి చంద్ర' స్మారక కథానికల పోటీ-2027, ఆనంద నిలయం, ఇంటి నంబర్ 1-5-1020/4, బి.ఆర్.రావు నగర్, ఓల్డ్ అల్వాల్, సికింద్రాబాద్-500010. ఇతర వివరాలకు 9963616999 నంబర్‌ను సంప్రదించాలని కాంతారావు సూచించారు. బహుమతుల విషయంలో న్యాయ నిర్ణేతలదే తుది నిర్ణయమని, పోటీకి వచ్చిన కథానికలను తిరిగి పంపబోమని, వాటిని ప్రచురించే హక్కు నిర్వాహకులకు ఉంటుందని తెలిపారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

ఎమ్మెల్యే కాలే యాదయ్య
చేవెళ్లలో జీఎస్టీ ఏ వన్ డాక్యుమెంటేషన్ కార్యాలయం ప్రారంభం
ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ సమత వెంకట్ రెడ్డి





చేవెళ్ల నవంబర్ 18(ప్రజా జ్యోతి): చేవెళ్ల మున్సిపల్ కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ పరిధిలో ఉరెళ్ల వార్డుకు చెందిన గడ్డమీది కుమార్, కృష్ణ, శేఖర్, రాజు నూతనంగా ఏర్పాటు చేసిన జీఎస్టీ ఏ వన్ డాక్యుమెంటేషన్ కార్యాలయాన్ని బుధవారం ఎమ్మెల్యే కాలే యాదయ్య మున్సిపల్ చైర్ పర్సన్ సమత వెంకట్ రెడ్డి తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ.. నూతనంగా ఏర్పాటు చేసిన డాక్యుమెంటేషన్ కార్యాలయం ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. కార్యాలయ నిర్వాహకులు నాణ్యమైన సేవలతో ప్రజల మన్ననలు పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు శైలజ ఆగిరెడ్డి, మనీషా అనంత్ రెడ్డి, పైండ్ల మధుసూదన్ రెడ్డి, పెద్దోళ్ల దయాకర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అత్తెలి అనంత్ రెడ్డి, కోఆప్షన్ సభ్యులు ఫరిన్ ఖదీర్ పాషా, మాజీ సర్పంచ్ పడాల ప్రభాకర్, కేసారం శ్రీనివాస్, బుర్ల మహేష్ వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా నేడు ప్రారంభం...

బీమా పథకంపై మున్సిపల్ సిబ్బందికి ప్రత్యేక శిక్షణ.!

అర్హులైన ప్రతి కుటుంబానికి 5 లక్షల జీవిత బీమా

ప్రజలు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్





ఇబ్రహీంపట్నం నవంబర్ 18 ప్రజాజ్యోతి: అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అందిస్తున్న రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక భరోసా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఇబ్రహీంపట్నం మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్ ప్రజలకు సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న "ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం" ద్వారా అర్హులైన కుటుంబాలకు రూ.5 లక్షల జీవిత బీమా ఆర్థిక భరోసా కల్పించనుంది. ఈ పథకాన్ని స్వర్గీయ ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా, ఈ నెల 19వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రారంభించనున్న నేపథ్యంలో, ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలో, బుధవారం ఏర్పాటుచేసిన సమావేశంలో పథకం అమలుకు సంబంధించి సిబ్బందికి ప్రత్యేక శిక్షణా కార్యక్రమం నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వై సుదర్శన్ తెలిపారు. ఇబ్రహీంపట్నం మున్సిపల్ కార్యాలయంలో సంబంధిత క్యాంప్ ఇన్‌ఛార్జ్‌లు, సూపర్‌వైజర్లు, వార్డు అధికారులు డేటా ఎంట్రీ ఆపరేటర్లకు ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహించబడుతుందని కమిషనర్ పేర్కొన్నారు. ఈ శిక్షణలో భాగంగా ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా శిబిరాల ఏర్పాటు, దరఖాస్తుల స్వీకరణ, కుటుంబాన్ని పోషించే 18--59 సంవత్సరాల వయస్సు గల సభ్యుల ఆధార్ ఆధారిత వయస్సు ధృవీకరణ, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ తదితర అంశాలపై సిబ్బందికి సమగ్ర అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆర్భాటాలలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉన్న నిబద్ధత అర్హులైన లబ్ధిదారులను గుర్తించడంలో లేదు...అర్హులైన

లబ్ధిదారులందరికీ పెన్షన్లు అందే వరకు బిఆర్ఎస్ పార్టీ వారి పక్షాన పోరాడుతుంది : బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్



కుత్బుల్లాపూర్ నవంబర్ 18(ప్రజా జ్యోతి)ఆర్భాటాలకే తప్పా అర్హులైన లబ్ధిదారులందరికీ అందని"చేయూత" పెన్షన్లు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా కంటి దుడుపు చర్యగా పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అబద్ధపు పునాదులపై ప్రజలను మోసం చేస్తూ ఏర్పాటైన కాంగ్రెస్ ప్రభుత్వం ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆర్భాటంగా ప్రారంభించిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం అర్హులైన లబ్ధిదారులందరికీ పెన్షన్లను అందించక మరోమారు లబ్ధిదారులను మోసం చేసింది.చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం కొంపల్లిలోని కెవిఆర్ కన్వెన్షన్ నందు నిర్వహించిన "చేయూత" పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, బిఆర్ఎస్ ఎల్పివిప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ హాజరై లబ్ధిదారులకు "చేయూత" పెన్షన్లను పంపిణీ చేశారు.అనంతరం బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ మాట్లాడుతూ మోసపూరిత వాగ్దానాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయి మూడు సంవత్సరాలు గడుస్తున్నా అర్హత ఉన్న లబ్ధిదారులలో కొందరికే పెన్షన్లను మంజూరు చేసి తూతూ మంత్రంగా చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా నిర్వహించిన ఈ ఆసరా పెన్షన్ల కార్యక్రమంలో ఆర్భాటాలే తప్పా అర్హులైన లబ్ధిదారులందరికీ పెన్షన్లు అందించేయాలనే నిబద్ధత ప్రభుత్వానికి కనపడటం లేదు. అందరికీ అందాల్సిన చేయూత పెన్షన్లకై మూడు సంవత్సరాలుగా నిరీక్షిస్తున్న లబ్ధిదారులల్లో మరో మారు నిరాశనే మిగిలించింది. ప్రభుత్వంలోకి వచ్చిన 100 రోజుల్లో 4000/- పెన్షన్ను అందిస్తామని చెప్పి అరచేతిలో వైకుంఠం చూపుతో ప్రజలను మోసం చేస్తూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే మూడు, నాలుగు సార్లు దరఖాస్తులను తీసుకొని చివరి నిమిషంలో వచ్చిన కొందరు లబ్ధిదారులకు మాత్రమే పెన్షన్ అందజేసి చేతులు దులుపుతుంది. రూ.4000/- పెన్షన్ దేవుడెరుగు అర్హులైన వృద్ధులకు పెన్షన్లు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వం ఉంది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో నాడు 58 సంవత్సరాలకు పెన్షన్ కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులకు మూడు సంవత్సరాలకు 61 సంవత్సరాలు వచ్చినా వారికి పెన్షన్లు ఇవ్వకుండా ప్రజలను మోసం చేస్తుంది. ఈ ప్రభుత్వం కమిషన్ల కోసం, మంచాల కోసం పనిచేసే ప్రభుత్వమే కానీ ప్రజల సంక్షేమం కోసం పనిచేసే ప్రభుత్వం కాదు. కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థత, అవినీతితో ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. ఈ ప్రభుత్వంలోని మంత్రులు, ఎమ్మెల్యేల పరిస్థితి ఎలా ఉందంటే రానున్న ఎన్నికల్లో కనీసం పోటీ చేసే పరిస్థితిలో కూడా ఒక్క మంత్రి, ఒక్క ఎమ్మెల్యే కూడా లేడు. అసలు కాంగ్రెస్ పార్టీలో ఒక్కరు కూడా మిగిలే పరిస్థితి లేదు.మా అధినేత కెసిఆర్ బయటకు వస్తే కాంగ్రెస్ పార్టీకి, అభ్యర్థులకు డిపాజిట్ కూడా రాదనే విషయం కాంగ్రెస్ నాయకులకు స్పష్టంగా అర్థమైంది, కాంగ్రెస్ పార్టీ బీ - ఫామ్ మీద పోటీ చేయలేని దిగజారిన స్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వ పరిస్థితి ఉంది.ప్రచార ఆర్భాటాలకే తప్పా అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు సంక్షేమ పథకాలు అందడం లేదు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పెన్షన్ అందే వరకు దరఖాస్తు దారుల పక్షాన పోరాడేందుకు బిఆర్ఎస్ పార్టీ సిద్ధంగా ఉంది.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, ఉప కమిషనర్లు లావణ్య, సాబేర్ అలీ, వెంకట మణి కరణ్, శంకర్ సింగ్, రాములు, లక్ష్మీ ప్రసన్న, వివిధ విభాగాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి సోదరుడు నీలకంఠం విష్ణు అకాల మరణం

సంతాపం వ్యక్తం చేసిన వివిధ పార్టీల నేతల



తలకొండపల్లి,నవంబర్ 18 (ప్రజాజ్యోతి) రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలో బీజేపీ పార్టీ అధ్యక్షులు నీలకంఠం పాండు సోదరుడు నీలకంఠ విష్ణు అకాల మరణం చెందారు. ఈ విషాద వార్త తెలిసిన వెంటనే గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.పార్టీలకు అతీతంగా వివిధ పార్టీల నాయకులు,గ్రామ ప్రముఖులు, బంధుమిత్రులు, అభిమానులు, మహిళా సంఘం సభ్యులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంతాపం తెలిపారు.విష్ణు అందరితో కలివిడిగా ఉంటూ,సౌమ్య స్వభావంతో,అందరికీ ఆప్తుడిగా మెలిగే వ్యక్తి అని,ఆయన అకాల మరణం కుటుంబానికి,గ్రామానికి తీరని లోటని నాయకులు అన్నారు.చిన్న వయస్సులోనే ఆయన దూరం కావడం అందరినీ కలచివేసిందని,ఆయన జ్ఞాపకాలు,ఎప్పటికీ గుర్తుండిపోతాయని పేర్కొన్నారు.వారి ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థించారు.కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి,ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని,బాధలో పాలుపంచుకుంటామని నాయకులు హామీ ఇచ్చారు.పాండు కుటుంబానికి జరిగిన ఈ విషాదంలో గ్రామం మొత్తం వారి వెంట ఉందని తెలిపారు.సంతాపం వ్యక్తం చేసిన వారిలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి,బిజెపి నాయకులు తల్లోజు ఆచారి,కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీ చంద్ రెడ్డి తదితరులు ఉన్నారు.అలాగే నీలకంఠ విష్ణు అంత్యక్రియల్లో గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని, పూలమాలలు వేసి,పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ రాష్ట్ర నాయకులు దోమ మోహన్ రెడ్డి,మాజీ ఎంపీపీ డి.లక్ష్మీదేవి రఘురాములు,గ్రామ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఆవంచ నర్సింహారెడ్డి,నాయకులు కాకి కృష్ణ,మీ సేవ మల్లేష్,వివిధ పార్టీల నాయకులు,వివిధ పార్టీల అధ్యక్షులు, కార్యదర్శులు, మహిళా సంఘం సభ్యులు,నాయకులు తదితరులు పాల్గొన్నారు.

టీయూడబ్ల్యూజే రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా గంట్ల రాజిరెడ్డి

శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం





శేరిలింగంపల్లి,నవంబర్ 18 (ప్రజాజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా శేరిలింగంపల్లి కి చెందిన సీనియర్ జర్నలిస్టు గంట్ల రాజిరెడ్డి ఎన్నికయ్యారు.రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా నియమితులైన గంట్ల రాజిరెడ్డిని బుధవారం శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.చందనగర్ లోని పి జె ఆర్ స్టేడియంలో నిర్వహించిన కార్యాక్రమనికి రాష్ట్ర నాయకులు ఫైళ్ల విఠల్ రెడ్డి,రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు ఉప్పరి శేఖర్ సాగర్,శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఉప్పరి రమేష్ సాగర్, ప్రధాన కార్యదర్శి మెట్టు జగన్ రెడ్డి లతో పాటు జర్నలిస్టులు హాజరై గంట్ల రాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా గంట్ల రాజిరెడ్డి మాట్లాడుతూ... తనపై నమ్మకంతో రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడిగా ఎన్నుకున్న యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు,మీడియా అకాడమీ మాజీ చైర్మన్ అల్లం నారాయణ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఆస్కాని మారుతి సాగర్ లకు కృతజ్ఞతలు తెలిపారు. క్షేత్రస్థాయిలో జర్నలిస్టులు ఎదుర్కొంటున్న ఇళ్ల స్థలాలు, అక్రిడిటేషన్ కార్డులు,హెల్త్ కార్డులు తదితర సమస్యలను రాష్ట్ర కమిటీ దృష్టికి తీసుకెళ్లి, వాటి పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి ప్రెస్ క్లబ్,టెంజు కార్యవర్గ సభ్యులతో పాటు పలువురు సీనియర్ జర్నలిస్టులు,ప్రెస్ క్లబ్ సభ్యులు పాల్గొని రాజిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

ఆలూరుకు ఆర్టీసీ బస్సులు పునరుద్ధరించాలి

ఎమ్మెల్యే కాలే యాదయ్యకు గ్రామస్తుల వినతి



చేవెళ్ల నవంబర్ 18(ప్రజా జ్యోతి): ఆలూరు గ్రామానికి నిలిపివేసిన ఆర్టీసీ బస్సు సర్వీసులను వెంటనే పునరుద్ధరించాలని గ్రామస్తులు కోరారు. ఈ మేరకు బుధవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఆలూరు నుంచి ప్రతిరోజూ ఎంతోమంది విద్యార్థులు చేవెళ్లలోని పాఠశాలలు, కళాశాలలకు రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. రైతులు, ఇతర గ్రామస్తులు సైతం వివిధ అవసరాల నిమిత్తం చేవెళ్లకు వెళ్లాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో అందుబాటులో ఉన్న ఆర్టీసీ బస్సు సర్వీసును అకస్మాత్తుగా నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా విద్యార్థులు సమయానికి పాఠశాలలు, కళాశాలలకు చేరుకోలేకపోతున్నారని వాపోయారు. గతంలో నడిచిన ఉదయం 8.30 గంటల బస్సుతో పాటు మధ్యాహ్నం 2.30, రాత్రి 8.30 గంటలకు కూడా బస్సు సర్వీసులను పునరుద్ధరించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, రైతులు, గ్రామ ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని ఆర్టీసీ అధికారులతో మాట్లాడి బస్సుల రాకపోకలు తిరిగి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు.

హబ్సిగూడలో ఘనంగా అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవం

పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి





ఉప్పల్, నవంబర్18,(ప్రజాజ్యోతి): హబ్సిగూడలో గౌతమ్ గంట స్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీ అయ్యప్ప స్వామి మహాపడి పూజ మహోత్సవంలో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్ప స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. అయ్యప్ప స్వామి భక్తుల నామస్మరణతో కార్యక్రమ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. ఈ కార్యక్రమంలో గంధం నాగేశ్వర్ రావు,పవన్ కుమార్ అయ్యప్ప స్వాములు భక్తులు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

ఇటీవల జరిగిన మా నూతన గృహప్రవేశానికి కొన్ని అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనర్సింహ గారు,





ఈరోజు ప్రత్యేకంగా మా నివాసానికి విచ్చేసి మాతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉంది. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే శ్రీ మైనంపల్లి హనుమంతరావు గారు కూడా విచ్చేసి మమ్మల్ని అభినందించడం సంతోషంగా ఉంది.ఈ సందర్భంగా రేపు నిర్వహించనున్న చలో సిద్ధిపేట కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. వారి పిలుపు మేరకు ప్రతి ఒక్కరం భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం.ఈ కార్యక్రమంలో కావలి గణేష్, మహిపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సాధు యాదవ్, పృథ్వీ, మహేష్, ప్రశాంత్, రెడ్డి కృష్ణ యాదవ్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు. మా నివాసానికి విచ్చేసి ఆత్మీయతను పంచుకున్న నాయకులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

ప్రభుత్వం డంపింగ్ యార్డ్ ప్రతిపాదనను రద్దు చేయాలి

ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాయిని నవీన్ రెడ్డి
ప్రజల ఆమోదం లేకుండా అనుమతులు ఎలా ఇస్తారు
కాలుష్య కోరలతో ఈ ప్రాంతానికి ముప్పు ప్రమాదం
రద్దు చేయకుంటే ప్రజలతో పోరాటాలకు సన్నద్ధమవుతాం



యాచారం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): హైదరాబాద్ నుంచి రోజుకు వందలాది లారీల ద్వారా భారీగా చెత్తను తరలించి డంపింగ్ యార్డు ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతమంతా కాలుష్య కోరల్లో చిక్కుకునే ప్రమాదం ఉందని ఎన్ఎన్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు నాయిని నవీన్ రెడ్డి అన్నారు. యాచారం గ్రామంలో ప్రతిపాదించిన శ్రీ వెంకటేశ్వర పవర్ ప్రాజెక్టును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. బుధవారం విడుదల చేసిన పత్రికా ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. యాచారం గ్రామంలోని సర్వే నంబర్లు 105 నుంచి 125 వరకు సుమారు 25 ఎకరాల్లో ప్రజల ఆమోదం లేకుండా డంపింగ్ యార్డు ఏర్పాటుకు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. ప్రజల ఆరోగ్యం, రైతుల జీవనోపాధిని దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం వెంటనే డంపింగ్ యార్డు ప్రతిపాదనను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని హెచ్చరించారు.

జూలపల్లిలో ఘనంగా పుష్పత్ రెడ్డి వర్ధంతి వేడుకలు

పుష్పత్ రెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పించిన మండల నాయకులు





తలకొండపల్లి,నవంబర్ 18 (ప్రజాజ్యోతి) తలకొండపల్లి మండల మాజీ ఎంపీపీ జి.విమలమ్మ భర్త పుష్పత్ రెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని జూలపల్లి గ్రామంలో బుధవారం ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి,పూలు చల్లి ఘనంగా నివాళులర్పించారు.ఆయన చేసిన సేవలను,గ్రామ అభివృద్ధికి చేసిన కృషిని ఈ సందర్భంగా పలువురు స్మరించుకున్నారు.పుష్పత్ రెడ్డి ఎల్లప్పుడూ గ్రామ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ,అందరికీ అండగా నిలిచే వ్యక్తిగా నిలిచారని,ఆయన సేవాగుణం,సౌమ్య స్వభావం,ప్రజల పట్ల చూపిన ఆదరణ ఎప్పటికీ మరువలేమని నాయకులు కొనియాడారు.ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ,కుటుంబ సభ్యులు ప్రజాసేవలో కొనసాగుతున్నారని తెలిపారు.ఈ కార్యక్రమంలో పుష్పత్తి రెడ్డి వారి కుమారుడు బిఆర్ఎస్ మండల యూత్ లీడర్ విజయ్ కుమార్ రెడ్డి, హమాజీ జెడ్పీటీసీ పద్మ నరసింహ,మాజీ జెడ్పీ కోఆప్షన్ సభ్యులు ముజఫర్ రహమాన్,తలకొండపల్లి సర్పంచ్ల సంఘం అధ్యక్షులు కటికల శేఖర్ యాదవ్,మాజీ సర్పంచ్ లలితజ్యోతయ్య,తలకొండపల్లి మండల పాత్రికేయులు వెంకట్ రెడ్డి,శంకర్,మహేష్,తిరుపతి,శేఖర్తోపాటు వివిధ పార్టీల నాయకులు,గ్రామ ప్రముఖులు, బంధుమిత్రులు,అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని నివాళులర్పించారు.

ఘనంగా ప్రసాద్ గురువు షష్టిపూర్తి వేడుకలు

ముఖ్య అతిథులుగా పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్



శేరిలింగంపల్లి,నవంబర్ 18 (ప్రజాజ్యోతి):గురువుగారు సౌభాగ్యానందనాథ ప్రసాదరావు గురుస్వామి గారు 60 వసంతములు పూర్తి చేసుకున్న సందర్భంగా శేరిలింగంపల్లి నియోజకవర్గం చందానగర్ డివిజన్... పిజేఆర్ ఎంక్లేవ్ అయ్యప్ప స్వామి ఆలయంలో నిర్వహించిన షష్టిపూర్తి వేడుకలకు శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా గురువు తల్లిదండ్రులైన కీ.శే.అల్లు వీర అప్పారావు రాజేశ్వరి దంపతుల దివ్య ఆశీస్సులతో గురువు,గురువు ధర్మపత్ని కి కార్పొరేటర్ పుష్పగుచ్ఛం అందజేసి.. శాలువాతో సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.గురువు ఆరోగ్యం,ఆయుష్షు, సుఖసంతోషాలతో ఎల్లప్పుడూ సుఖశాంతులతో ఉండాలని.. వారి ఆశీస్సులు,ఆధ్యాత్మిక మార్గదర్శకత్వం ప్రజలందరికీ ఎల్లప్పుడూ లభించాలని కార్పొరేటర్ ఆకాంక్షించారు. ఈ వేడుకలో ప్రభాకర్ స్వామి,మల్లేష్ స్వామి, శిష్యులు,భక్తులు, కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం ప్రారంభం

మండల ప్రత్యేక అధికారి శశిధర్ రెడ్డి
బీమా పథకం నమోదుపై అధికారులకు దిశా నిర్దేశం
గ్రామాల్లో పథకం నమోదును సమర్థవంతంగా చేపట్టాలి





యాచారం, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం నమోదుపై అధికారులకు సమగ్రంగా శిక్షణ ఇచ్చినట్లు మండల ప్రత్యేక అధికారి శశిధర్ రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రారంభించేందుకు కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండల పరిషత్ కార్యాలయ సమావేశం మందిరంలో మండల ప్రత్యేక అధికారి.. పంచాయతీ కార్యదర్శులు, విలేజ్ స్పెషల్ ఆఫీసర్లతో కలసి సమావేశం నిర్వహించారు. నేడు మండలంలోని అన్ని గ్రామాల్లో ఇందిరమ్మ కుటుంబం జీవిత బీమా పథకం ప్రారంభం కానుందన్నారు. ఈ నేపద్యంలో గ్రామాల్లో పథకం నమోదుకు అర్హతలు, చేపట్టాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేసినట్లు చెప్పారు. ఆన్లైన్ ద్వారా ఇందుకు సంబంధించిన వివరాలను ఎలా నమోదు చేయాలో మార్గదర్శనం చేసినట్లు చెప్పారు. కుటుంబంలో సంపాదించే వ్యక్తి 18 నుంచి 59 ఏళ్ల వయసు ఉండాలని ఆ వ్యక్తికి బీమా కల్పించనున్నట్లు చెప్పారు. సంపాదించే వ్యక్తి మరణిస్తే కుటుంబానికి రూ. రూ.5 లక్షల ఆర్థిక సాయం అందుతుందన్నారు.. అయితే నేటి నుంచి ఈ పథకం కోసం గ్రామపంచాయతీల్లో ఫారాలు సమర్పించాలని స్వీకరించిన బీమా పథకం పారాలను ఎంపీడీవో కార్యాలయం నందు సమర్పించాలని సూచించారు. నమోదు ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీవో రాధారాణి, తహసిల్దార్ అయ్యప్ప, ఎంపీఓ శ్రీలత, ఎంఏఓ రవినాథ్, పలువురు పంచాయతీ కార్యదర్శులు, గ్రామ ప్రత్యేక అధికారులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

భూమి ఒప్పందం పేరుతో మోసం.. గోడ కూల్చివేత!

అడ్వాన్స్ తిరిగిస్తామన్నా ఒప్పుకోలేదని ఆరోపణ.. ఇద్దరిపై కేసు



చేవెళ్ల, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): భూమి విక్రయ ఒప్పందం పేరుతో మోసానికి పాల్పడటమే కాకుండా, ప్రహరీ గోడను కూల్చివేసి బెదిరింపులకు దిగినట్లు ఇద్దరిపై ఫిర్యాదు అందింది. ఈ ఘటన ముడిమ్యాల్ గ్రామ పరిధిలో జరిగింది. ఫిర్యాదుదారు రుఖ్సార్ హైద్రీ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామంలోని పలు సర్వే నంబర్ల పరిధిలో ఉన్న నాలుగు ప్లాట్లలో మొత్తం 800 చదరపు గజాల స్థలం ఆమె తండ్రి స్వాధీనంలో ఉంది. ఈ భూమి మీదుగా గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే వెళ్తుందని రియల్ ఎస్టేట్ బ్రోకర్ ఖలీల్ తప్పుడు సమాచారం ఇచ్చి, గజానికి రూ.4,700 చొప్పున తక్కువ ధరకు విక్రయించేలా ఒప్పించాడని ఆరోపించారు. అనంతరం తన సోదరుడు అబ్దుల్ నయీమ్ పేరుతో విక్రయ ఒప్పందం చేయించుకున్నట్లు తెలిపారు. తన తండ్రి అనారోగ్యంతో శస్త్రచికిత్సల అనంతరం మంచానికే పరిమితమయ్యారని, ఈ పరిస్థితిని ఆసరాగా చేసుకుని ఒప్పందం రద్దుకు నిరాకరించారని పేర్కొన్నారు. అడ్వాన్స్ డబ్బులు తిరిగి ఇచ్చేందుకు సిద్ధమైనా అంగీకరించలేదని, భూమి వద్దకు వస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని బెదిరించినట్లు ఫిర్యాదులో తెలిపారు. ఈ నెల 18న కుటుంబ సభ్యులతో కలిసి స్థలం వద్దకు వెళ్లగా ప్రీకాస్ట్ ప్రహరీ గోడలో కొంత భాగం కూల్చివేసి ఉండటాన్ని గుర్తించారు. గోడపై రాసి ఉన్న తన తండ్రి ఫోన్ నంబర్‌ను కూడా చెరిపివేశారని ఆరోపించారు. దీనిపై ఖలీల్, అబ్దుల్ నయీమ్‌లను ప్రశ్నించగా, తిరిగి స్థలం వద్దకు రావద్దని బెదిరించినట్లు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు చేవెళ్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మంత్రి దామోదర రాజనర్సింహా, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు గృహానికి రాక.. ఆత్మీయ భేటీ

కుత్బుల్లాపూర్ నవంబర్ 18(ప్రజా జ్యోతి) ఇటీవల జరిగిన మా నూతన గృహప్రవేశానికి కొన్ని అనివార్య కారణాల వల్ల హాజరుకాలేకపోయిన రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ప్రత్యేకంగా మా నివాసానికి విచ్చేసి మాతో కలిసి మధ్యాహ్న భోజనం చేయడం ఎంతో ఆనందంగా ఉంది. అదేవిధంగా మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు కూడా విచ్చేసి మమ్మల్ని అభినందించడం సంతోషంగా ఉంది.ఈ సందర్భంగా రేపు నిర్వహించనున్న చలో సిద్ధిపేట కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని వారు పిలుపునిచ్చారు. వారి పిలుపు మేరకు ప్రతి ఒక్కరం భాగస్వాములై కార్యక్రమాన్ని విజయవంతం చేద్దాం.ఈ కార్యక్రమంలో కావలి గణేష్, మహిపాల్ రెడ్డి, నరసింహారెడ్డి, సాధు యాదవ్, పృథ్వీ, మహేష్, ప్రశాంత్, రెడ్డి కృష్ణ యాదవ్, లింగంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.మా నివాసానికి విచ్చేసి ఆత్మీయతను పంచుకున్న నాయకులు, కార్యకర్తలందరికీ హృదయపూర్వక ధన్యవాదాలు.

కొకూర్ కాలనీల్లో వెలుగుల జాతర.. 34 నూతన వీధి దీపాలతో ప్రజలకు భద్రత, సౌకర్యం!



అల్వాల్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) కొకూర్ పరిధిలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలకు చేపట్టిన మిషన్ బ్రైట్ కొకూర్ కార్యక్రమం మరో ముందడుగు వేసింది. మైనంపల్లి హనుమంతరావు నాయకత్వంలో, మల్కాజిగిరి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, సామాజిక కార్యకర్త తుడిమెళ్ల మల్లికార్జున్ ఆధ్వర్యంలో సమాల లక్ష్మీనగర్, భర్వపేట్, భారత్ నగర్ కాలనీలలో మొత్తం 34 నూతన వీధి దీపాలను ఏర్పాటు చేశారు.కాలనీల్లో రాత్రి వేళల్లో తగినంత వెలుతురు లేక ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను గుర్తించి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తుడిమెళ్ల మల్లికార్జున్ తెలిపారు. నూతన వీధి దీపాల ఏర్పాటుతో ప్రజలకు మెరుగైన వెలుతురుతో పాటు భద్రత పెరుగుతుందని, రాత్రి సమయాల్లో పాదచారులు, వాహనదారుల రాకపోకలు సులభతరం అవుతాయని పేర్కొన్నారు.ప్రజల అవసరాలను గుర్తించి, వారి సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ మౌలిక సదుపాయాల కల్పనలో భాగంగా మిషన్ బ్రైట్ కొకూర్ కార్యక్రమాన్ని నిరంతరం కొనసాగిస్తామని ఆయన వెల్లడించారు. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా, కాలనీల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అల్లి మల్లేష్, అల్లి పండు, గౌరీనాథ్, గోమారం ప్రభాకర్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డి, జీకే రావు, లక్ష్మారెడ్డి, పంటల అన్నయ్య, మహిపాల్ రెడ్డితో పాటు పలువురు నాయకులు, ఆయా కాలనీలకు చెందిన మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.

గూడూరుకు ఎమ్మెల్యే రాక

పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్
మండలంలోని కాంగ్రెస్ పార్టీ నాయకులందరూ పాల్గొనాలి
గూడూర్ సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా



కొత్తూరు నవంబర్ 18 (ప్రజా జ్యోతి) కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో గురువారం ఉదయం 11 గంటలకు షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గూడూరు గ్రామానికి వస్తున్నట్లు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు.అలాగే తీగాపూర్,మల్లాపూర్,మల్లాపూర్ తాండ,మక్తగూడ గ్రామాల లబ్ధిదారులకు మంజూరైన చేయూత పింఛన్లు,ఇందిరమ్మ ఇందిరమ్మ ఇళ్ల ప్రొస్టింగ్ లు గూడూరులో ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చెయ్యనున్నట్లు ఆయన తెలియజేశారు. వీటితోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు గూడూరు సర్పంచ్ ఉప్పల దయానంద్ గుప్తా వివరించారు.ఈ కార్యక్రమానికి మండల అధ్యక్షులు,వివిధ గ్రామాల సర్పంచులు,మాజీ ఎంపీటీసీలు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు, అభిమానులు, మీడియా సోదరులు అందరూ హాజరు కావలసిందిగా ఆయన కోరారు.

ఉద్యమ త్యాగాలకు గుర్తింపు ఏదీ..? హామీల అమలు కోసం 63 రోజులుగా అల్వాల్‌లో దీక్షలు!



అల్వాల్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఎన్నో త్యాగాలు చేసి, ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ అల్వాల్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 63వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా దీక్షా శిబిరం వేదికగా నాయకులు ప్రభుత్వంపై తమ డిమాండ్లను మరోసారి వినిపించారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ముందుండి పోరాడిన ఉద్యమకారులను ప్రభుత్వం గుర్తించి, వారికి సముచిత గౌరవం కల్పించాల్సిన బాధ్యత ఉందని నాయకులు పేర్కొన్నారు. ఉద్యమకారుల సంక్షేమానికి సంబంధించిన విధివిధానాలను వెంటనే ఖరారు చేసి, అర్హులైన ప్రతి ఒక్కరికీ గుర్తింపు కార్డులు మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వం ప్రకటించిన సంక్షేమ పథకాలను అమలు చేయాలని కోరారు. ఇచ్చిన హామీలను ఇకనైనా ఆలస్యం చేయకుండా నెరవేర్చి ఉద్యమకారులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.63వ రోజు రిలే నిరాహార దీక్షలో భాగంగా బి. పరమేశ్వర్, జనార్దన్ రావు దీక్షలో కూర్చున్నారు. ఈ కార్యక్రమంలో పాటోళ్ల సురేందర్ రెడ్డి, దయాకర్ ముత్యాలు, శ్రీనివాస్ గౌడ్, రవి తదితరులు పాల్గొని దీక్షకు సంఘీభావం ప్రకటించారు.

కేటీఆర్‌ను కలిసిన పృథ్వీరాజ్

హరితసేన కార్యక్రమాలకు కేటీఆర్ అభినందన



చేవెళ్ల, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే కేటీఆర్‌ను గ్రీన్ ఇండియా హరిత సేన చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పూలపల్లి పృథ్వీరాజ్ బుధవారం ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో హరితసేన ఆధ్వర్యంలో చేపట్టిన కార్యక్రమాలను కేటీఆర్‌కు వివరించారు. వినాయక చవితి సందర్భంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా మట్టి వినాయక విగ్రహాల పంపిణీతో పాటు చేపట్టిన పలు సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమాలను కేటీఆర్ అభినందించారని పృథ్వీరాజ్ తెలిపారు. ఇలాంటి పర్యావరణహిత కార్యక్రమాలను మరిన్ని చేపట్టాలని కేటీఆర్ ప్రోత్సహించారని చెప్పారు. పార్టీ బలోపేతానికి కూడా కృషి చేయాలని సూచించినట్లు పేర్కొన్నారు.

హెచ్ఎంటీ పునరుద్ధరణకు కృషి చేస్తా.
. కార్మికుల సమస్యలు పరిష్కరిస్తా

ప్రధానమంత్రి, కేంద్ర మంత్రుల దృష్టికి హెచ్ఎంటీ సమస్యలు తీసుకెళ్తా: రాజ్యసభ ఎంపీ ఆర్. కృష్ణయ్య





కుత్బుల్లాపూర్ నవంబర్ 18(ప్రజా జ్యోతి) జీడిమెట్ల పారిశ్రామిక ప్రాంతంలోని హెచ్ఎంటీ మిషన్ టూల్స్ సంస్థను తిరిగి పూర్వవైభవానికి తీసుకురావడంతో పాటు కార్మికులు, ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని రాజ్యసభ సభ్యులు, ఓబీసీ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు ఆర్. కృష్ణయ్య హామీ ఇచ్చారు. సంస్థ సమస్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో పాటు కేంద్ర ఆర్థిక మంత్రి, భారీ పరిశ్రమల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. బుధవారం ఆల్ ఇండియా బీసీ ప్రధాన కార్యదర్శి అల్లం యాదయ్యతో కలిసి ఆయన జీడిమెట్ల ఇండస్ట్రియల్ ఏరియాలోని హెచ్ఎంటీ మిషన్ టూల్స్ యూనిట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా హెచ్ఎంటీ యూనియన్ నాయకులు, ఓబీసీ సంఘం ప్రతినిధులు సంస్థ ఎదుర్కొంటున్న సమస్యలను ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం యూనిట్ జీటీఎం శ్రీకుమార్‌తో సమావేశమై సంస్థ ప్రస్తుత పరిస్థితి, పునరుద్ధరణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే హెచ్ఎంటీ చైర్మన్ రమేష్ కుమార్‌తో ఫోన్‌లో మాట్లాడి సంస్థ పరిస్థితి, సమస్యలు, పునరుద్ధరణకు సంబంధించిన అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్. కృష్ణయ్య మాట్లాడుతూ హెచ్ఎంటీ సంస్థ పునరుద్ధరణకు కేంద్ర ప్రభుత్వ స్థాయిలో చొరవ తీసుకుంటానని, కార్మికులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడేందుకు అవసరమైన చర్యల కోసం సంబంధిత మంత్రులతో మాట్లాడతానని పేర్కొన్నారు. లిరిటైర్డ్ ఉద్యోగుల బకాయిల చెల్లింపునకు కృషి హెచ్ఎంటీలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమకు రావాల్సిన రిటైర్మెంట్ బకాయిలు ఇంకా అందలేదని ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై స్పందించిన ఆర్. కృష్ణయ్య, రిటైర్డ్ ఉద్యోగుల సమస్యలను కూడా ప్రధానమంత్రి దృష్టికి తీసుకెళ్లి, పెండింగ్ బకాయిల చెల్లింపునకు కృషి చేస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎంటీ యూనియన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులు శ్రీశైలం, సత్యనారాయణ, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ జీ, శ్రీనివాస్ నాయక్, ఉపాధ్యక్షులు ఏఎన్ చారి, జాయింట్ సెక్రటరీ లచ్చయ్య, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ రతన్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాంబాబు, కోశాధికారి శ్రీహరి తదితరులు పాల్గొన్నారు. ఓబీసీ అసోసియేషన్ నాయకులు మాదన్నతో పాటు పలువురు నాయకులు హాజరయ్యారు.

ఏఐ పదజాలంపై అవగాహనతోనే
విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు





అబ్దుల్లాపూర్ మెట్టు నవంబర్ 18 (ప్రజాజ్యోతి) నైపుణ్య భారతం--2047, వికసిత భారతం--2047 లక్ష్యాలకు అనుగుణంగా కృత్రిమ మేధస్సు అక్షరాస్యతకు ప్రాధాన్యం
భువనగిరి సెయింట్ ఎలిజబెత్ కాన్వెంట్ పాఠశాలలో అవగాహన సదస్సు,మారుతున్న ఆధునిక సాంకేతిక ప్రపంచంలో కృత్రిమ మేధస్సు కీలక పాత్ర పోషిస్తున్న నేపథ్యంలో విద్యార్థులకు చిన్న వయస్సు నుంచే కృత్రిమ మేధస్సుపై పరిజ్ఞానం, సాంకేతిక పదజాలం, నైతిక విలువలపై అవగాహన కల్పించడం ద్వారా ఉజ్వల భవిష్యత్తుకు పునాదులు వేయవచ్చని ఏఐ నీడ్స్ డాట్ ఇన్ వ్యవస్థాపకుడు, విద్యావేత్త, రచయిత జోసెఫ్ ఆంథోనీ గువ్వల అన్నారు.
హైదరాబాద్ కేంద్రంగా పనిచేస్తున్న ఏఐ నీడ్స్ డాట్ ఇన్ ఆధ్వర్యంలో బుధవారం భువనగిరిలోని సెయింట్ ఎలిజబెత్ కాన్వెంట్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల కోసం కృత్రిమ మేధస్సు అక్షరాస్యత, సాంకేతిక పదజాలంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కృత్రిమ మేధస్సు, యంత్ర అభ్యాసం, సృజనాత్మక కృత్రిమ మేధస్సు, నాడీ సంబంధిత నెట్‌వర్క్‌లు, కృత్రిమ మేధస్సు ప్రతినిధులు, స్వయంచాలక సాంకేతిక విధానాలు వంటి ఆధునిక అంశాలను సులభంగా వివరించారు. కృత్రిమ మేధస్సు సాధనాలను ఉపయోగించడం మాత్రమే దానిపై పూర్తి అవగాహన కలిగి ఉండటమని భావించకూడదని, వాటి వెనుక ఉన్న సాంకేతిక భావనలు, పదజాలం, పనితీరును అర్థం చేసుకోవడమే నిజమైన పరిజ్ఞానానికి పునాది అని జోసెఫ్ ఆంథోనీ గువ్వల వివరించారు. విద్యార్థులు కేవలం సాంకేతిక అనువర్తనాల వినియోగదారులుగా మిగిలిపోకుండా, వాటి పనితీరును అర్థం చేసుకొని సృజనాత్మకంగా ఆలోచించే స్థాయికి ఎదగాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన రచించిన ప్రపంచంలోనే తొలిసారిగా 13 వేలకుపైగా ఏఐ పదాలతో రూపొందించిన ఏఐ పదకోశ గ్రంథం -- అక్షర క్రమంలో ఏ నుంచి జెడ్ వరకు ఏఐ పదకోశ గ్రంథం అక్షర క్రమంలో ఏ నుంచి జెడ్ వరకు ఏఐ భాషను అర్థం చేసుకుందాం -- ఆచరణాత్మక పదజాలం అనే పుస్తకాల ప్రాధాన్యతను వివరించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యావేత్తలు కృత్రిమ మేధస్సుకు సంబంధించిన వేలాది సాంకేతిక పదాలను సులభంగా అర్థం చేసుకునేందుకు ఈ పుస్తకాలను రూపొందించినట్లు తెలిపారు.

కృత్రిమ మేధస్సు నేర్చుకోవడానికి పదజాలమే పునాది

ఈ సందర్భంగా జోసెఫ్ ఆంథోనీ గువ్వల మాట్లాడుతూ, ఇంగ్లీషు భాషను నేర్చుకోవడానికి పదజాలం ఎంత ముఖ్యమో, కృత్రిమ మేధస్సును అర్థం చేసుకోవడానికి దాని సాంకేతిక పదజాలం కూడా అంతే అవసరమని అన్నారు. విద్యార్థులు ఏఐ సాధనాలను ఉపయోగించడానికే పరిమితం కాకుండా, వాటి వెనుక ఉన్న సాంకేతిక పరిజ్ఞానం, భావనలను తెలుసుకోవాలని సూచించారు. అప్పుడే భవిష్యత్తులో వచ్చే సాంకేతిక మార్పులను అర్థం చేసుకొని వాటిని సమర్థవంతంగా వినియోగించుకోగలుగుతారని పేర్కొన్నారు.

బాధ్యతాయుత వినియోగంపై ప్రత్యేక అవగాహన

సదస్సులో కృత్రిమ మేధస్సు నైతికత, వ్యక్తిగత సమాచార గోప్యత, సమాచార భద్రత, తప్పుడు సమాచారాన్ని గుర్తించడం, విద్యారంగంలో కృత్రిమ మేధస్సు వినియోగం, విద్యాపరమైన నిజాయితీ వంటి అంశాలపై ప్రత్యేకంగా అవగాహన కల్పించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించే క్రమంలో విమర్శనాత్మక ఆలోచన, సృజనాత్మకత, బాధ్యతాయుత ప్రవర్తన, నైతిక విలువలను కూడా అలవర్చుకోవాలని సూచించారు.

దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాల విస్తరణ లక్ష్యం

నైపుణ్య భారతం స్ఫూర్తితో పాటు వికసిత భారతం--2047 జాతీయ లక్ష్యాలకు అనుగుణంగా దేశవ్యాప్తంగా కృత్రిమ మేధస్సు అక్షరాస్యతను విస్తరించడమే తమ సంస్థ ప్రధాన లక్ష్యమని జోసెఫ్ ఆంథోనీ గువ్వల తెలిపారు. పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఇంజినీరింగ్ విద్యాసంస్థలు, విశ్వవిద్యాలయాల్లో కృత్రిమ మేధస్సు పదజాలం, సాంకేతిక పరిజ్ఞానం, బాధ్యతాయుత వినియోగంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నట్లు వెల్లడించారు. కృత్రిమ మేధస్సుపై అవగాహన కేవలం కంప్యూటర్ విద్యార్థులకే పరిమితం కాకుండా అన్ని విద్యా విభాగాల విద్యార్థులకు అవసరమవుతోందని పేర్కొన్నారు. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు సాంకేతికతను అర్థం చేసుకోగలిగే, విశ్లేషించగలిగే, బాధ్యతాయుతంగా వినియోగించగలిగే నూతన తరాన్ని తీర్చిదిద్దడమే తమ ఆశయమని ఆయన స్పష్టం చేశారు.

డిసెంబర్ 7 నుండి 13 వరకు ప్రతిష్టాత్మక 'ఇండియాజాయ్'

బంజారాహిల్స్,నవంబర్18(ప్రజాజ్యోతి) : రాష్ట్రంలోని యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్, కామిక్స్ ఎకోసిస్టమ్‌ను మరింత బలోపేతం చేసి, సృజనాత్మక ఆర్థిక వ్యవస్థను ప్రపంచ వేదికపైకి తీసుకెళ్లే దిశగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోందని ప్రతినిధులు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 7 నుండి 13 వరకు జరగనున్న ప్రతిష్టాత్మక 'ఇండియాజాయ్ 2026' వేడుకలకు సన్నాహకంగా ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షత వహించారు. ఈ భేటీలో ఇన్వెస్ట్ తెలంగాణ ఏవీజీసీ మరియు ఆరెంజ్ ఎకానమీ డైరెక్టర్ వల్లభి ఎ., ఎస్టీపీఐ హైదరాబాద్ డైరెక్టర్ కవిత సి. సహా పలువురు ఉన్నతాధికారులు, మీడియా మరియు ఎంటర్‌టైన్‌మెంట్ రంగ ప్రముఖులు పాల్గొన్నారు. గ్లోబల్ ఏవీజీసీ రంగంలో తెలంగాణ ప్రాభవాన్ని విస్తరించడం, సినీ పరిశ్రమ భాగస్వామ్యాన్ని పెంచడం, అంతర్జాతీయ ప్రతినిధుల రాక మరియు వ్యూహాత్మక భాగస్వామ్యాలపై ఇందులో ప్రధానంగా చర్చించారు. సమావేశంలో గ్రీన్ గోల్డ్ యానిమేషన్ సీఎంఓ భరత్ లక్ష్మీపతి, ప్రాజెక్ట్ పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ డైరెక్టర్ టొమాస్జ్ వాల్‌జాక్, రోటోమేకర్ సీఈఓ, టీవీఏజీఏ జనరల్ సెక్రటరీ మరియు ఇండియాజాయ్ కో-ఫౌండర్ మైక్ యథామ్ పాల్గొని పరిశ్రమల మధ్య సహకారానికి ఉన్న అవకాశాలను వివరించారు. అనంతరం నిర్వహించిన 'తెలంగాణ ఏవీజీసీ క్రియేటివ్ షోకేస్' లో 1312 ఇంటరాక్టివ్ ఫౌండర్ దీపక్, పర్పుల్ టాక్ సీటీఓ వంశీ, ప్రముఖ సినిమాటోగ్రాఫర్ కె.కె. సెంథిల్ కుమార్ పాల్గొని రాష్ట్రంలోని స్వదేశీ సృజనాత్మక, సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించారు.



ఈ ఏడాది ఇండియాజాయ్ వేడుకలు 'ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్' లో భాగం కావడం ద్వారా టెక్నాలజీ, ఇన్నోవేషన్, జీసీసీ ల సరసన ఏవీజీసీ రంగం నిలిచిందన్నారు. దీనివల్ల స్థానిక ట్యాలెంట్‌కు, స్టూడియోలకు అంతర్జాతీయ ఇన్వెస్టర్లతో నేరుగా అనుసంధానమయ్యే అవకాశం లభిస్తుందన్నారు. డిసెంబర్ 7 నుండి 13 వరకు హైదరాబాద్‌లోని భారత్ ఫ్యూచర్ సిటీ వేదికగా జరగనున్న ఈ ఏడు రోజుల వేడుకకు యానిమేషన్, వీఎఫ్ఎక్స్, గేమింగ్, ఫిల్మ్, ఓటీటీ, ఈ-స్పోర్ట్స్ రంగాలకు చెందిన ప్రపంచ స్థాయి నిపుణులు, దిగ్గజ కంపెనీలు తరలిరానున్నాయని పేర్కొన్నారు.

ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ కుమారుని వివాహ ఆహ్వాన పత్రికను సీఎం రేవంత్ రెడ్డికి అందజేత

రాజేంద్రనగర్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తన కుమారుడు సంతోష్ గౌడ్ వివాహ వేడుక ఈనెల 22వ తేదీన జరగనుంది.
ఈ శుభకార్యాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వివాహ ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ వేడుకకు విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించవలసిందిగా సీఎం రేవంత్ రెడ్డిని సాదరంగా ఆహ్వానించారు.



ఆరాంఘర్ బ్రిడ్జి వద్ద కత్తితో బెదిరించి మొబైల్ దోపిడీ

రెండు గంటల్లోనే నిందితులను పట్టుకున్న మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు

రాజేంద్రనగర్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) బుధవారం ఉదయం సుమారు 08:30 గంటల సమయంలో మైలార్‌దేవుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆరాంఘర్ బ్రిడ్జి సమీపంలో దోపిడీ ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్‌నగర్ నుండి హైదరాబాద్‌కు తిరిగి వస్తున్న ఫిర్యాదుదారు కొల్లోజు శ్రీకాంత్ (38) ఆరాంఘర్ వద్ద బస్సు దిగి దుర్గానగర్ వైపు ఉన్న బ్రిడ్జి సమీపంలోని వాష్‌రూమ్‌కు వెళ్లి తిరిగి బస్ స్టాప్ వైపు వస్తుండగా ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెనుక నుండి వచ్చి అడ్డగించారు. కత్తితో బెదిరించి మొబైల్ ఫోన్ ఇవ్వాలని డిమాండ్ చేయగా బాధితుడు నిరాకరించడంతో అతనిపై దాడి చేసి బలవంతంగా వన్‌ప్లస్ మొబైల్ ఫోన్‌ను లాక్కొని పరారయ్యారు. ఈ దాడిలో బాధితుని ఎడమ చేతికి రక్తగాయమైంది. ఘటనపై బాధితుడు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసిన పోలీసులు వెంటనే దర్యాప్తు చేపట్టి, కేవలం రెండు గంటల వ్యవధిలోనే నిందితులను పట్టుకున్నారు. సుమారు 20-22 ఏళ్ల వయస్సు గల ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

ఉప్పల్‌లో యువతి అదృశ్యం.. యువకుడిపై అనుమానం

ఉప్పల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 19 ఏళ్ల యువతి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. స్వరూప్‌నగర్‌లోని ఏషియన్ థియేటర్ వెనుక ఉన్న సంజన అపార్ట్‌మెంట్స్‌లో నివాసం ఉంటున్న గోపన్నగారి శేషకుమారి (45) తన పెద్ద కుమార్తె గోపన్నగారి ఆద్య (19) ఫ్యాషన్ డిజైనర్‌గా పనిచేస్తున్నట్లు తెలిపారు.గత కొద్ది రోజులుగా ఆద్య నవీన్ అనే యువకుడితో ఫోన్‌లో మాట్లాడుతుండటంతో కుటుంబ సభ్యులు గత నాలుగైదు రోజులుగా ఆమెను మందలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ క్రమంలో నవంబర్ 18న ఉదయం 7:30 గంటల సమయంలో ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయిందని, తన మొబైల్ ఫోన్‌ను ఇంట్లోనే వదిలివెళ్లినట్లు తెలిపారు. ఎంతసేపటికీ కుమార్తె తిరిగి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదని పేర్కొన్నారు. నవీన్‌పై అనుమానం వ్యక్తం చేస్తూ తల్లి ఉప్పల్ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు యువతి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు.



ఉప్పల్‌లో వివాహిత మహిళ అదృశ్యం

పోలీసులను ఆశ్రయించిన భర్త

ఉప్పల్, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వివాహిత మహిళ అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చిలుకానగర్‌కు చెందిన నాస్పూరి రవి (40) వృత్తిరీత్యా మేస్త్రీగా పనిచేస్తున్నాడు. ఆయన భార్య నాస్పూరి సరిత (37) బేకరీలో పనిచేస్తోంది.ఈ నెల 15వ తేదీ మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సరిత ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. అనంతరం ఆమె కోసం భర్త బంధువులు, స్నేహితులు, పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు.గతంలో కూడా సరిత రెండుసార్లు ఇంటి నుంచి వెళ్లిపోయి రెండు రోజుల తర్వాత తిరిగి వచ్చినట్లు ఫిర్యాదులో పేర్కొన్నాడు. గత కొన్ని నెలలుగా సురేష్ అనే వ్యక్తితో ఆమె ఫోన్‌లో మాట్లాడుతున్న విషయంపై తాను పలుమార్లు ప్రశ్నించి హెచ్చరించినట్లు తెలిపాడు. తన భార్య అదృశ్యం వెనుక సదరు వ్యక్తి ప్రమేయం ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.భార్య ఆచూకీ గుర్తించి, అవసరమైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరాడు. ఈ మేరకు ఉప్పల్ పోలీసులు ఫిర్యాదు స్వీకరించి దర్యాప్తు చేపట్టారు.



హైకోర్టు కాలనీలో ఘనంగా దీపావళి శ్రావణ్ కుమార్ జన్మదిన వేడుకలు

ఎల్బీనగర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) వనస్థలిపురం లోని 48వ డివిజన్ హైకోర్టు కాలనీలో దీపావళి శ్రావణ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి శ్రావణ్ కుమార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ వేడుకల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్నేహితులు, స్థానికులు పాల్గొన్నారు.



మొయినాబాద్‌లో రెండు విడతలుగా ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం

ఈ నెల 20 నుంచి మొదటి విడత కార్యక్రమం ప్రారంభం

26 వార్డుల ప్రజలు అధికారులకు సహకరించాలి :

మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ జాకీర్ అహ్మద్

మొయినాబాద్: నవంబర్ 18 (ప్రజా జ్యోతి) మొయినాబాద్ మున్సిపాలిటీ పరిధిలో ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుకు అధికారులు చర్యలు చేపట్టారు. రంగారెడ్డి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పరిధిలోని మొత్తం 26 వార్డుల్లో ఈ కార్యక్రమాన్ని రెండు విడతలుగా నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెల్లడించారు. ఈ నెల 20వ తేదీ నుంచి మొదటి విడత కార్యక్రమం ప్రారంభం కానుంది. మొదటి విడతలో అప్పోజిగూడ 19వ వార్డు, అజీజ్‌నగర్ 5 నుంచి 8వ వార్డులు, చిలుకూరు 1, 20 నుంచి 22వ వార్డులు, మొయినాబాద్ 15, 23 నుంచి 25వ వార్డులు, మూర్తుజాగూడ 12వ వార్డులో కార్యక్రమం నిర్వహించనున్నారు. రెండో విడతలో హిమాయత్‌నగర్ 2 నుంచి 4వ వార్డులు, 10వ వార్డు, పెద్దమంగళారం 16 నుంచి 18వ వార్డులు, 26వ వార్డు, సురంగల్ 13, 14వ వార్డులు, యెన్కెపల్లి 9, 11వ వార్డుల్లో కార్యక్రమం కొనసాగించనున్నారు. ఈ పథకం అమలులో భాగంగా సంబంధిత ప్రాంతాల ప్రజలు అధికారులకు, క్షేత్రస్థాయి సిబ్బందికి పూర్తి సహకారం అందించాలని కమిషనర్ కోరారు. అధికారులు కేటాయించిన సమయంలో ప్రజలు అందుబాటులో ఉండి, పథకానికి అవసరమైన సమాచారం, ధ్రువపత్రాలను అందించాలని సూచించారు. ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం విజయవంతంగా అమలయ్యేలా మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ విజ్ఞప్తి చేశారు.



పేదల పింఛన్లను అడ్డుకుంటే సహించేది లేదు

మధుయాష్కి గౌడ్



ఎల్బీనగర్ నవంబర్ 18 (ప్రజాజ్యోతి) ఎల్బీనగర్ నియోజకవర్గంలోని నూతన పింఛన్ లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం బుధవారం చంపాపేట మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకాగా, మాజీ ఎంపీ, ఏఐసీసీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, జోనల్ కమిషనర్ వికాస్ మహతో పాల్గొని లబ్ధిదారులకు పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మధుయాష్కి గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా 4.50 లక్షల కొత్త పింఛన్లు మంజూరు చేసిందని, రంగారెడ్డి జిల్లాలో 33 వేల మందికి, ఎల్బీనగర్ నియోజకవర్గంలో 3,600 మందికి పింఛన్లు అందిస్తున్నట్లు తెలిపారు. మహిళలను కోటీశ్వరులుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఇందిరమ్మ కుటుంబ బీమా కింద రూ.5 లక్షల బీమా సదుపాయం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు కేటాయించి డ్రైనేజీలు, సీసీ రోడ్లు, బోర్లు, కమ్యూనిటీ హాళ్ల నిర్మాణం చేపడుతున్నామని వివరించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను అడ్డుకోవాలని ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి ప్రయత్నించడం సరికాదని, ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలకు ఆటంకం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

విద్యార్థులే రోడ్డు భద్రతా రాయబారులు కావాలి

సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 'అరైవ్ ఆ లైవ్' అవగాహన కార్యక్రమం

ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్ ఏర్పాటు.. 120 మంది విద్యార్థులకు అవగాహన

బోయిన్ పల్లి, నవంబర్ 18.(ప్రజా జ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని ట్రాఫిక్ తిరుమలగిరి డివిజన్ ఏసీపీ జి. శంకర్ రాజు సూచించారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బి. సుమతి, ఐపీఎస్ ఆదేశాల మేరకు, డీసీపీ ట్రాఫిక్-1 కె. రాహుల్ రెడ్డి, ఐపీఎస్ పర్యవేక్షణలో బుధవారం తిరుమలగిరిలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో 'అరైవ్ లైవ్ ' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సుమారు 120 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏసీపీ జి. శంకర్ రాజు విద్యార్థులకు రోడ్డు భద్రత ప్రాముఖ్యతను వివరించారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించేటప్పుడు హెల్మెట్ ధరించడం, కార్లలో సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవడం, ట్రాఫిక్ సిగ్నల్స్ పాటించడం, జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటడం వంటి అంశాలపై అవగాహన కల్పించారు.అతివేగం, మద్యం సేవించి వాహనాలు నడపడం, డ్రైవింగ్ సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం వంటి





ఉల్లంఘనలు ప్రాణాంతక ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే రోడ్డు భద్రతా నియమాలను అలవర్చుకోవడంతో పాటు తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, స్నేహితులకు కూడా అవగాహన కల్పించాలని సూచించారు.ఈ సందర్భంగా పాఠశాలలో ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్ అరై వ్ లైవ్ ను అధికారికంగా ఏర్పాటు చేశారు. విద్యార్థుల్లో రోడ్డు భద్రతపై నిరంతర అవగాహన పెంపొందించడం, వారిని రోడ్డు భద్రతా రాయబారులుగా తీర్చిదిద్దడం ఈ క్లబ్ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. విద్యార్థులు ఈ క్లబ్ ద్వారా అవగాహన కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని సమాజంలో ట్రాఫిక్ నిబంధనలపై చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఫాదర్ మైఖేల్ డిసౌజా, పాఠశాల యాజమాన్యం తరఫున బ్రిగెట్ పాల్గొన్నారు. ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని వారు అభినందిస్తూ, విద్యార్థుల్లో రోడ్డు భద్రతా అవగాహన పెంపొందించేందుకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణ కోసం తిరుమలగిరి ట్రాఫిక్ డివిజన్ పరిధిలోని మరిన్ని విద్యాసంస్థల్లో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు ట్రాఫిక్ సేఫ్టీ క్లబ్‌లను ఏర్పాటు చేస్తామని ఏసీపీ శంకర్ రాజు వెల్లడించారు.

చేయూత పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఉద్రిక్తత..

స్టేజిపైనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నిరసనలి



ఎల్బీనగర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని చంపాపేట మల్టీపర్పస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చేయూత పత్రాల పంపిణీ కార్యక్రమంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. ప్రభుత్వ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సభా వేదికపై ప్రోటోకాల్ లేని వ్యక్తులు కూర్చోవడంపై ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేయడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. దీంతో ఆయన వేదికపైనే పడుకుని నిరసన వ్యక్తం చేశారు.

రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలి

తాండూర్ పట్టణ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

అందరి సమిష్టి నిర్ణయంతోనే సమస్య పరిష్కారం

ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి







తాండూరు నవంబర్ 18 ప్రజా జ్యోతి :- తాండూర్ పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం అన్ని వర్గాలకు చెందిన వ్యాపారులు, ప్రముఖులు, ప్రజలు సమిష్టిగా నిర్ణయం తీసుకుంటేనే సాధ్యమవుతుందని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి సూచించారు.ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారమే తన ముందున్న లక్ష్యం అని గుర్తు చేశారు. బుధవారం రోజు తాండూరు పట్టణంలోని పుర ప్రముఖులతో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో పలు సమస్యలపై ఎమ్మెల్యేతో చర్చించారు. ముఖ్యంగా తాండూర్ పట్టణ ప్రజలు ఎదుర్కొంటున్న అత్యంత కీలకమైన సమస్యలలో నివాస ప్రాంతాలు ఇండస్ట్రియల్ జోన్‌గా నమోదై ఉండటంతో స్థానిక ప్రజలకు అనేక రకాలుగా ఇబ్బందులు ఎదురవుతున్నాయని గుర్తు చేశారు. ఇండస్ట్రియల్ జోన్ నుంచి రెసిడెన్షియల్ జోన్‌గా మార్చేందుకు చేపట్టాల్సిన చర్యలపై రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్తలు,రిటైర్డ్ ఉద్యోగులు, ఇంజనీర్లు, రాజకీయ నాయకులు తమ అభిప్రాయాలను ప్రస్తావించారు.గతంలో కూడా ఆయా ప్రాంతాలను రెసిడెన్షియల్ జోన్‌గా మార్చేందుకు పలుమార్లు ప్రయత్నించినప్పటికీ ఆశించిన ఫలితం రాలేదని అన్నారు. జోన్ సమస్య కారణంగా ఆయా కాలనీల ప్రజలు మున్సిపాలిటీ ద్వారా అందాల్సిన కొన్ని సౌకర్యాలు, అనుమతులు పొందడంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఈ సమావేశం పట్టణ అభివృద్ధికి ప్రముఖుల ద్వారా అభిప్రాయ సేకరణ అనేది చక్కటి వేదికైందని ఎమ్మెల్యేకు పలువురు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి మాట్లాడుతూ తాండూర్ పట్టణ అభివృద్ధి అనేది ఒక్కరి నిర్ణయంతో జరిగేది కాదని, పట్టణ ప్రజలు, మేధావులు, నిపుణులు, ప్రజాప్రతినిధులందరి అభిప్రాయాలు, సమిష్టి నిర్ణయాలతోనే సాధ్యమవుతుందని అన్నారు.జనావాస ప్రాంతాలు సైతం ఇండస్ట్రియల్ జోన్‌గా నమోదై ఉండటం అనేది ప్రజలకు నష్టం జరుగుతుందని ఆ ప్రాంతాల విలియం పాఠశాలపై ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి రెసిడెన్షియల్ జోన్‌గా మార్చాలనే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు.ఈ మార్పు అనేది తాండూర్ పట్టణంలో ఉన్న ప్రముఖుల నిర్ణయంతోనే చేయాలని ఈ సమావేశం ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు. మేజార్టీ సంఖ్యలో మీ అమూల్యమైన సూచనలు చేయడం సంతోషకరమైన విషయం అని ఎమ్మెల్యే అభినందించారు. అందరి అభిప్రాయాలు విన్నాం,మీ అందరూ అనుకున్న మాదిరిగానే, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, తాండూర్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకుందామని పిలుపు నిచ్చారు.తదుపరి మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి కౌన్సిల్ ఆమెదంతో ముందుకెళ్ళడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో తాండూర్ మున్సిపల్ చైర్ పర్సన్ నీరజా బాల్ రెడ్డి,మాజీ వైర్మన్లు లక్ష్మారెడ్డి, విశ్వనాథ్ గౌడ్, కోట్రిక విజయలక్ష్మి,స్వప్న పరిమల్,కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నాగరాజు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

రూ.8 లక్షలతో డ్రైనేజీ పనులు ప్రారంభం

5వ వార్డు అభివృద్ధికి రూ.3 కోట్లతో ప్రణాళికలు



బోయిన్ పల్లి, నవంబర్ 18.(ప్రజా జ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు 5వ వార్డు మహేంద్రహిల్స్ పరిధిలోని త్రిమూర్తి కాలనీ, రవి కాలనీలలో రూ.8 లక్షల కంటోన్మెంట్ బోర్డు నిధులతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను నామినేటెడ్ సభ్యురాలు బానుక నర్మద మల్లికార్జున్, ఎమ్మెల్సీ మల్కా కొమురయ్య ప్రారంభించారు.ఈ సందర్భంగా నర్మద మాట్లాడుతూ.. నామినేటెడ్ సభ్యురాలిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి 5వ వార్డులోని వివిధ కాలనీల్లో సుమారు రూ.2 కోట్లతో డ్రైనేజీ, తాగునీటి పైప్‌లైన్లు, సీసీ రోడ్ల నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు. కంటోన్మెంట్ బోర్డుకు మంజూరైన 500 ఎల్ఈడీ వీధి దీపాలను ప్రతి వార్డులో 50 చొప్పున ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. 5వ వార్డులో మరో రూ.3 కోట్లతో అభివృద్ధి పనులకు ప్రణాళికలు సిద్ధం చేశామని, ఎంపీ ఈటల రాజేందర్ నిధుల మంజూరుకు కృషి చేస్తున్నారని తెలిపారు. నిధులు విడుదలైన వెంటనే మిగిలిన పనులను దశలవారీగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీజేపీ వార్డు అధ్యక్షుడు సంతోష్, నాయకులు విజయానంద్, సతీష్, నిఖిల్, క్రాంతి, కాలనీ అధ్యక్షుడు వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి, కాలనీ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

తాండూర్ రూరల్ సిఐ గా చంద్రశేఖర్ రెడ్డి బాధ్యతలు

తాండూరు నవంబర్ 18 ప్రజా జ్యోతి :- తాండూర్ రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్గా చంద్రశేఖర్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇదివరకు రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహించిన ప్రవీణ్ కుమార్ రెడ్డి మెదక్ జిల్లా నారాయణఖేడ్ కు బదిలీపై వెళ్లినట్లు అధికార వర్గాల ద్వారా వెల్లడించారు. ఈ సందర్భంగా రూరల్ సీఐ చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ అందరికీ న్యాయం చేసే దిశగా కృషి చేస్తానని చెప్పారు.



అదేవిధంగా శాంతి భద్రతలకు ఆటంకం కలిగించే ఎంతటి వారైనా ఊరుకునేది లేదని హెచ్చరించారు. ఏ విధమైన ఇబ్బందికరమైన పరిస్థితులు ఉన్న ప్రజలు నేరుగా పోలీసులను సంప్రదించాలని సూచించారు.

తాండూర్ మాసర్ పాన్ లో బి ఆర్ ఎస్ కు స్థానం లేదా..!

-బిఆర్ఎస్ పార్టీ మండల ఇన్చార్జి ఎస్ వీరేందర్ రెడ్డి

తాండూరు నవంబర్ 18 ప్రజా జ్యోతి :- తాండూరు నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటుచేసిన తాండూరు మాస్టర్ ప్లాన్ విషయంలో బిఆర్ఎస్ పార్టీని ఎందుకు దూరం పెట్టారని తాండూరు మండల బిఆర్ఎస్ పార్టీ ఇన్చార్జి వీరేందర్ రెడ్డి ప్రశ్నించారు. తాండూరు పట్టణ అభివృద్ధిలో భాగంగా ఏర్పాటు చేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి స్థానం కల్పించకపోవడం బాధాకరంగా ఉందని చెప్పారు. గతంలో 2011లోనే తాండూరు పట్టణ మాస్టర్ ప్లాన్ కు ప్రణాళిక చేశామని గుర్తు చేశారు. తదుపరి మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి నాయకత్వంలో ప్రిన్సిపల్ సెక్రటరీ వరకు ఇట్టి విషయం చర్చించినట్లు గుర్తు చేశారు. అదేవిదంగా ప్రస్తుతం కూడ మా పార్టీ అందరూ సహకరించేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ మాకు చెప్పకపోవడం బాధాకరమన్నారు. ప్రస్తుతం తాండూరు నియోజకవర్గంలో సుమారు 70 మంది సర్పంచులుగా 12 మంది కౌన్సిలర్లుగా ప్రాతినిధ్యం వహిస్తున్నప్పటికీ అత్యంత కీలకమైన సమావేశానికి ఎందుకు ఆహ్వానించలేరని ప్రశ్నించారు. ఓవైపు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి పార్టీలకు అతీతంగా అందరి సమన్వయంతో ముందుకు వెళ్తామంటున్న మాటలకు బుధవారం చేసిన సమావేశానికి అర్థం ఏమిటని ప్రశ్నించారు. తాండూరు పట్టణ అభివృద్ధికి ఇండస్ట్రియల్ ఏరియా మార్పుకు గ్రామీణ ప్రాంతానికి సంబంధం ఉందనేది గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉందని సూచించారు.



బాలకృష్ణ నగర్ ఫేస్--3లో డ్రైనేజ్ సమస్య పరిష్కారానికి కృషి! ఆకారపు అరుణ్ పటేల్





ఉప్పల్,నవంబర్ 18,(ప్రజాజ్యోతి): బాలకృష్ణ నగర్ ఫేస్--3 కాలనీ అధ్యక్షులు వీణ గోపాల్ కాలనీలో నెలకొన్న డ్రైనేజ్ సమస్యను ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఆకారపు అరుణ్ పటేల్ దృష్టికి తీసుకురావడం జరిగింది.వెంటనే స్పందించిన అరుణ్ పటేల్ సంబంధిత అధికారులను, రవీందర్ రెడ్డి ని తీసుకువెళ్లి కాలనీలోని డ్రైనేజ్ సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించారు.కాలనీవాసుల విజ్ఞప్తి మేరకు కొత్త పైప్లైన్ ఏర్పాటు చేసేందుకు ఎస్టిమేషన్ సిద్ధం చేయించి, ఉప్పల్ నియోజకవర్గ ఇన్చార్జ్ మందముల పరమేష్ రెడ్డి తో మాట్లాడి శాంక్షన్ చేయించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో కాలనీవాసులు, కాలనీ పెద్దలు పాల్గొని తమ సమస్యలను వివరించారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపిన ఆకారపు అరుణ్ పటేల్ కు కాలనీవాసులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ప్రజా సమస్యలే ప్రాధాన్యతగా.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు సాగుతున్న ఆకారపు అరుణ్ పటేల్,ఈ కార్యక్రమం లో బాలకృష్ణ నగర్ ఫేస్ టు అధ్యక్షులు కాసింగౌడ్ గౌరవ అధ్యక్షులు సీనియర్ నాయకులు స్వామి షబీర కాలనీ అధ్యక్షుడు మహమ్మద్ అశ్వక్ శంకర్ నాగరాజు సతీష్ చంద్రమోహన్ రఘు పాషా సవీన్ నరసింహ చారి కాలనీవాసులు పాల్గొన్నారు

రైతులకు తెల్లజొన్న విత్తనాల పంపిణీ

ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రోత్సాహం
50 మంది రైతులకు విత్తనాలు అందజేసిన ఎమ్మెల్యే టీఆర్ఆర్



పరిగి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): ప్రస్తుత వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులకు అండగా నిలుస్తూ ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించే లక్ష్యంతో తెల్లజొన్న విత్తనాలను పంపిణీ చేశారు. పరిగి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం (టీఆర్వీకే), పరిగి ఆధ్వర్యంలో ఐసీఏఆర్--భారతీయ చిరుధాన్యాల పరిశోధనా సంస్థ సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి 50 మంది రైతులకు తెల్లజొన్న సూటి రకం విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.


మాట ఇచ్చాం నిలబెట్టుకున్నాం

చేయుత పెన్షన్ సర్టిఫికెట్స్ అందజేసిన ఎమ్మెల్యే
హర్షం వ్యక్తం చేసిన లబ్ధిదారులు



తాండూరు, పెద్దేముల్ నవంబర్ 18 ప్రజా జ్యోతి:- రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే అర్హులైన అందరికీ కూడా చేయూత పెన్షన్లను అందజేస్తామని గత ఎన్నికలలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నామని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి చెప్పారు. బుధవారం రోజు పెద్దేముల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో భాగంగా జనగాం గ్రామ సర్పంచ్ అరుణ సమక్షంలో లబ్ధిదారులకు పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనగాం గ్రామానికి 41 మందికి నూతన పెన్షన్లు మంజూరైనట్లు చెప్పారు. అదేవిధంగా పెద్దేముల్ మండలానికి మొత్తం 908 నూతన చేయూత పెన్షన్లు మంజూరైనట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పెద్దేముల్ మండల అధ్యక్షుడు లొంకా నర్సింలు, పిఏసిఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి, కోటపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత,వైస్ చైర్మన్ మధులత శ్రీనివాస్ చారి,కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు శోభ రాణి, సర్పంచ్ ల సంఘ అధ్యక్షుడు నారాయణ గౌడ్,సీనియర్ నాయకులు ఎల్ రెడ్డి, పెద్దేముల్ సర్పంచ్ డివై నర్సింలు, పలు గ్రామాలకు చెందిన సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు పంచాయతీ కార్యదర్శులు, లబ్ధిదారులు, తదితరులు ఉన్నారు.

ప్రజా సంక్షేమే - ప్రజా ప్రభుత్వ లక్ష్యం



దౌల్తాబాద్ నవంబర్ 18(ప్రజాజ్యోతి): దౌల్తాబాద్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో చేయూత పింఛన్ల ప్రొసీడింగ్ కాపీలను అందజేశారు,ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు మాట్లాడుతూ దౌల్తాబాద్ మండలంలో 715 మందికి పింఛన్లు మంజూరు అయ్యాయని తెలిపారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేయూత పింఛన్లను పంపిణీ చేస్తుందని తెలిపారు, లబ్ధిదారులందరికీ ఆర్థిక శుభాకాంక్షలు తెలిపారు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితులు ఆశాజనకంగా లేకపోయినా ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని తెలిపారు,పేదల సంక్షేమం ప్రజల ఆత్మగౌరమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం నడుస్తుందని పేర్కొన్నారు, పింఛన్ కోసం ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నా ఒంటరి మహిళలు వితంతువులు దివ్యాంగులు ఆత్మగౌరవంతో బతకాలని ఉద్దేశంతో ప్రజా ప్రభుత్వం కొత్త పింఛన్లను మంజూరు చేసిందని తెలిపారు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మహిళలను కోటీశ్వరులుగా చేయాలని గొప్ప సంకల్పంతో ముందుకు వెళ్తున్నారని తెలిపారు, ఇప్పటికే అనేక సంక్షేమ పథకాలు మహిళల కోసం ప్రజా ప్రభుత్వం ప్రవేశపెడుతుందని తెలిపారు, ఎలక్షన్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని అన్నారు, చేయూత పింఛన్లు రానివారు ఎవరు కూడా అధైర్యపడవద్దు ప్రతి ఒక్కరికి వచ్చేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు,ఈ కార్యక్రమం స్పెషల్ ఆఫీసర్ సురేష్ బాబు,ఎంపీడీవో ఉషనప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వెంకట్రావు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉప అధ్యక్షులు వెంకట్ రెడ్డి,జంగం వీరన్న,మాజీ ఎంపిపి పటేల్ విజయ్ కుమార్,సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి,శ్రీకాంత్ రెడ్డి,సర్పంచుల సంఘం అధ్యక్షులు రెడ్యానాయక్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు రెడ్డి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షులు వెంకట్రాములు, మండల కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ కుర్మనీ దస్తప్ప, వివిధ గ్రామాల సర్పంచ్ లు మాజీ ఎంపీటీసీలు నాయకులు లబ్ధిదారులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు,

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా బొమ్మక్ శ్రీనివాస్

పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపిన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు

బోడుప్పల్ ప్రజా జ్యోతి ప్రతినిధి: మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులుగా బోడుప్పల్ డివిజన్ కు చెందిన బొమ్మక్ శ్రీనివాస్ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతులమీదుగా నియామక పత్రాన్ని బుధవారం అందుకున్నారు. ఈ సందర్భంగా బొమ్మక్ శ్రీనివాస్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో తాను చేసిన సేవలను గుర్తించిన కాంగ్రెస్ పార్టీ నాయకత్వం తనకు ఈ పదవీ ఇవ్వడం సంతోషంగా ఉందని పేర్కొన్నారు.ఈ పదవీ రావడానికి కృషి చేసినందుకు గాను ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్, మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ పోగుల నరసింహ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొత్త కిషోర్ గౌడ్ లకు ధన్యవాదాలు తెలిపారు.భవిష్యత్తులో జరిగే ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం కృషి చేస్తానని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్ళే బృహత్తర బాధ్యతలను తీసుకుంటానని తెలిపారు.



ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి ప్రభుత్వ ప్రత్యేక ప్రాధాన్యత

పార్లమెంటరీ కమిటీ సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీగణేష్



బోయిన్ పల్లి, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): ఎస్సీ, ఎస్టీల సంక్షేమం, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యతనిస్తోందని ప్రభుత్వం పేర్కొంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన హైదరాబాద్లోని ఎంసీఆర్హెచ్ఆర్డీలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీల సంక్షేమంపై పార్లమెంటరీ కమిటీ సమావేశంలో సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎమ్మెల్యే ఎన్. శ్రీగణేష్ పాల్గొన్నారు.ఈ సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అమలు, విద్య, ఉపాధి అవకాశాలు, సామాజిక అభివృద్ధి, రాజకీయ ప్రాతినిధ్యం వంటి కీలక అంశాలపై చర్చించారు. సమాజంలోని అట్టడుగు వర్గాలకు సమాన అవకాశాలు కల్పించడం, వారి సంక్షేమం, అభ్యున్నతికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలపై సమీక్షించారు. ఎస్సీ, ఎస్టీలకు విద్యా, ఉద్యోగ రంగాల్లో మరిన్ని అవకాశాలు కల్పించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చ జరిగింది.

ఇబ్రహీంపూర్ తండా పాఠశాలను సందర్శించిన ఎంఈఓ ఎం. అంజయ్య

విద్యార్థులకు వైద్య పరీక్షలు.. మరోసారి ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు





పరిగి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): పరిగి మండలం ఇబ్రహీంపూర్ తండాలోని రూప్ సింగ్ నాయక్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో అడవి ఆముదం కాయలు తిని తొమ్మిది మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన ఘటన నేపథ్యంలో బుధవారం మండల విద్యాధికారి ఎం. అంజయ్య పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులను, పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాస్ను కలిసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు.పాఠశాల ఆవరణకు సమీపంలోని గ్రామ వ్యవసాయ పొలాల గట్లపై సుమారు 100 మీటర్ల దూరంలో అడవి ఆముదం చెట్లు ఉన్నాయని, పాఠశాల విరామ సమయంలో బయటకు వెళ్లిన విద్యార్థులు వాటి కాయలను తినడంతో అస్వస్థతకు గురయ్యారని వివరించారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గ్రామ పెద్దల సహకారంతో ఆ చెట్లను తొలగించినట్లు తెలిపారు.పాఠశాల ఆవరణలోనే కాకుండా పరిసర ప్రాంతాల్లోనూ విషపూరిత మొక్కలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధ్యాయుడు శ్రీనివాస్కు ఎంఈఓ సూచించారు. కాగా, ప్రభుత్వ వైద్య బృందం పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించింది. ఈ కార్యక్రమంలో గాడిసింగాపూర్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు జంప్లా, ఇబ్రహీంపూర్ తండా గ్రామ పెద్దలు, పంచాయతీ కార్యదర్శులు, ఎంఆర్సీ సిబ్బంది శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

శివాలయం నిర్మాణానికి దాతలు ముందుకు రావాలి కాంగ్రెస్ మండల యువ నాయకుడు జంగయ్య

కుల్కచర్ల మండలం నవంబర్ 18 (ప్రజాజ్యోతి) కుల్కచర్ల మండలం పిరంపల్లి గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయానికి దాతలు ముందుకు రావాలని కాంగ్రెస్ యువ నాయకుడు జంగయ్య పేర్కొన్నాడు ఈరోజు ఆలయానికి కూర యాదమ్మ 51 బస్తాల సిమెంటును విరాళంగా అందజేసి తన భక్తి భవాని చాటుకున్నారు ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు దాతలు ముందుకు రావాలని ఆమె తెలిపారు



పదేళ్లు పాలనలో ప్రజలను మోసం చేశారు

ఇచ్చిన మాట ప్రకారం జిల్లాలోనే అత్యధిక పెన్షన్లు మంజూరు చేశాం

18 ఏళ్లు నిండిన కుటుంబ యజమానికి 5 లక్షల బీమా ఇస్తాం

సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని అరాచకాలు

త్వరలోనే మహాలక్ష్మి పథకం అమలు చేస్తాం

40 రోజుల్లోనే నన్ను ఆదరించారు

తాండూరు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటా

అవ్వ తాతలకు 4000 పెన్షన్ చేస్తాం

జిల్లావ్యాప్తంగా 14,500 పెన్షన్లు మంజూరు

చేయూత పెన్షన్ల పంపిణీలో ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి







తాండూరు నవంబర్ 18 ప్రజాజ్యోతి:- గత బి ఆర్ ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న కూడా పదేళ్ల పాలనలో ప్రజలను నమ్మించి మోసం చేసిందని తాండూర్ ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి విమర్శించారు. బుధవారం రోజు తాండూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో విశ్వప్రసాద్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన చేయూత పెన్షన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని 33 గ్రామ పంచాయతీలకు చెందిన చేయూత పెన్షన్ల మంజూరు పత్రాలను ఆయా గ్రామాలకు చెందిన సర్పంచులు పంచాయతీ కార్యదర్శుల సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నేను తాండూరులో కొత్తగా అడుగుపెట్టిన 40 రోజుల్లోనే నన్ను ఆదరించి తాండూరు అసెంబ్లీ నుండి ఎమ్మెల్యేగా ఎన్నుకున్న మీ అందరికీ నేను రుణపడి ఉంటానని చెప్పారు. గత అసెంబ్లీ ఎన్నికలలో మీ అందరికీ ఇచ్చిన మాట ప్రకారం రేషన్ కార్డులు అందించడంతోపాటు అవసరమైన మేరకు సంక్షేమ పథకాలను అందిస్తూన్నామని చెప్పారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 14500 పెన్షన్లు మంజూరు కాగా తాండూరు నియోజకవర్గానికి సుమారు 5 వేల పెన్షన్లు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. ప్రస్తుతం అందించిన మంజూరు పత్రాలకు వచ్చే నెల నుండి పెన్షన్ డబ్బులు పొందవచ్చునారు. అదేవిదంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రతి పేద కుటుంబానికి న్యాయం జరగాలని సదుద్దేశంతో 18 ఏళ్లు నిండిన కుటుంబ యజమానికి రూ 5 లక్షల బీమా సౌకర్యం కల్పించేందుకు ప్రత్యేక కార్యచరణ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇలా అనేక సంక్షేమ పథకాలు చేస్తున్న క్రమములో ఓర్వలేని బీఆర్ఎస్ నాయకులు సోషల్ మీడియాను అడ్డుపెట్టుకొని అరాచకాలు సృష్టిస్తున్నారని విమర్శించారు. ఎన్నికలలో ఇచ్చిన మాట ప్రకారం ఆరు గ్యారెంటీల సంక్షేమ పథకంలో భాగంగా త్వరలోనే అర్హులైన ఆడపడుచులకు మహాలక్ష్మి పథకం ద్వారా రూ 2500 వందల సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గత ఎన్నికలలో నేను కేవలం మీ మధ్య ఉన్నది 40 రోజులు నన్ను ఆదరించారు తాండూరు అసెంబ్లీ నుండి కాంగ్రెస్ ఎమ్మెల్యేగా గెలిపించి అసెంబ్లీకి పంపించారని చెప్పారు.

ఇంతటి త్యాగం చేసిన మీ అందరి రుణం తీర్చుకునేందుకు తాండూరు ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటాఅని భరోసా కల్పించారు. అంతేకాకుండా ఇక కొద్ది కాలంలోనే అవ్వ తాతలకు రూ 4000 పెన్షన్ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వడ్డే శ్రీనివాస్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిసిసిబి మాజీ అధ్యక్షుడు రవి గౌడ్, పార్టీ సీనియర్ నాయకులు ఉత్తమ్ చంద్, పిఎసిఎస్ చైర్మన్ జనార్దన్ రెడ్డి,కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కరణ్ కోట్ సర్పంచ్ ఎం రాజ్ కుమార్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, సర్పంచులు విజయకుమార్, సుదర్శన్ రెడ్డి వెంకట్ రెడ్డి, నాగలక్ష్మి, స్వరూపరెడ్డి, మేఘమాల సుజన, అనసూయ, కమలాబాయి, నారాయణ శివరాజ్, నరేష్, మౌనిక, జయలక్ష్మి, నర్సమ్మ, మీనాక్షి, ప్రవీణ్ గౌడ్, రామ్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ నాగప్ప,పలు గ్రామాలకు చెందిన సర్పంచులు కాంగ్రెస్ పార్టీ నాయకులు రాజశేఖర్ రెడ్డి, హరీశ్వర్ రెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి, ఉదయ్ కుమార్ రెడ్డి, గౌడి రాములు, జె మహేష్, నారాయణరెడ్డి, గుండప్ప,వెంకటేష్,బిఆర్ఎస్ పార్టీ నాయకుడు వెంకటరామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

బీరప్ప గడ్డ డివిజన్లోని జాహిద్ నగర్ లో 27 లక్షల రూపాయల వ్యయంతో సిసి రోడ్డుకు శంకుస్థాపన

మాజీ కార్పొరేటర్ బన్నాల గీతా ప్రవీణ్ ముదిరాజ్

ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ....

ఎమ్మెల్యే బండారి

మాజీ కార్పొరేటర్ బన్నాల.





ఉప్పల్,నవంబర్ 18,(ప్రజాజ్యోతి): ఉమ్మడి చిలకనగర్ డివిజన్లోని బీరప్ప గడ్డ డివిజన్ లో ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మారెడ్డి మాజీ కార్పొరేటర్, జిహెచ్ఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యులు బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ తో కలిసి 27 లక్షల రూపాయల వ్యయంతో నిర్మిస్తున్న సిసి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మరియు మాజీ కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం 3 నెలల్లో జహీద్ నగర్ లో నూతన సీసీ రోడ్డు నిర్మిస్తామని చెప్పి మాట ప్రకారం మూడు నెలల్లో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశామని అన్నారు. అదేవిధంగా కాంట్రాక్టర్ కూడా రోడ్డు నిర్మాణ సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని కాలనీ వాసులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా సిసి రోడ్డు పనులు త్వరతగతిన పూర్తి చేసి వారికి అందుబాటులో తెచ్చే విధంగా చేయాలని ఆదేశించారు. ఇనాగ్రేషన్ అయిన వెంటనే మాజీ కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ కాంట్రాక్టర్ తో పనులు మొదలు పెట్టించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్, సీనియర్ నాయకులు కొక్కొండ జగన్, ఏదుల్ల కొండల్ రెడ్డి, ముద్దం శ్రీనివాస్ యాదవ్, రామాంజనేయులు, ఫారుక్ ఓబేద్, ఆజాద్,శ్యామ్, బాలు యాదవ్, సాయి టవర్ అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ సురేష్, శ్రీ నికేతన్ అపార్ట్మెంట్ ప్రెసిడెంట్ మోహన్ , వేద సింధు , శ్రీకాంత్ రెడ్డి సునీల్ రావు , మురళి, భాస్కర్ రెడ్డి, హనుమంతు రెడ్డి రామ్ రెడ్డి,రాము,మీనేష్, ఇక్బాల్, ప్రకాష్ రావు, సత్యనారాయణ, గంగ స్వామి,విజయ్, రఘునందన్, సమద్ భాయ్,మీరాజ్,ముజీబ్ భాయ్, మొదలగువారు పాల్గొన్నారు.

పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి:

జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా

పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరుపై సమీక్ష..

ఎన్‌డీపీఎస్, సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక నిఘా పెట్టాలని ఆదేశం





పరిగి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): వికారాబాద్ జిల్లా పోలీస్ శాఖలో కేసుల దర్యాప్తును వేగవంతం చేసి, నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా అధికారులను ఆదేశించారు. బుధవారం పరిగి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన ఆమె స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, వివిధ విభాగాల పనితీరు, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులు, పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతి, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్‌డీపీఎస్ కేసులకు సంబంధించి మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతరం నిఘా ఉంచాలని, వాటి నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. సైబర్ నేరగాళ్లను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా దొంగతనాల కేసులపై ప్రత్యేక దృష్టి సారించి నిందితులను త్వరితగతిన గుర్తించి కేసులను ఛేదించాలని ఆదేశించారు. నేరాల నివారణకు ముందస్తు చర్యలు చేపట్టడంతో పాటు, నమోదైన కేసుల్లో సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించాలని సూచించారు. సీసీటీఎన్ఎస్‌తో పాటు ఇతర ఆన్‌లైన్ పోలీస్ వ్యవస్థలకు సంబంధించిన పనులను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలని, ఎలాంటి పెండింగ్ లేకుండా చూడాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ రికార్డులను క్రమబద్ధంగా నిర్వహిస్తూ విధుల పట్ల బాధ్యత, క్రమశిక్షణ పాటించాలని సిబ్బందికి సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని, వారి సమస్యలను సమగ్రంగా పరిశీలించి చట్టపరిధిలో సత్వర న్యాయం అందించాలని తెలిపారు. ప్రజలకు నాణ్యమైన పోలీస్ సేవలు అందించేందుకు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఎస్పీ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పరిగి డీఎస్పీ శ్రీనివాస్, పరిగి సీఐ కొండల్ రెడ్డి, ఎస్ఐ మోహన కృష్ణ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి హరీష్ రావు ను కలిసిన ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, పాస్టర్ తిమోతి

క్రిస్మస్ వేడుకలకు ఆహ్వానం

ఉప్పల్, నవంబర్ 18, (ప్రజాజ్యోతి) పాస్టర్ తిమోతి నేతృత్వం లో నిర్వహించనున్న క్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరుకావాలని కోరుతూ మాజీ మంత్రి, సిద్దిపేట శాసనసభ్యులు తన్నీరు హరీష్ రావు ను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించడం జరిగింది. ఈ సందర్భంగా క్రిస్మస్ వేడుకల నిర్వహణ గురించి వివరించి, క్రైస్తవ సోదర సోదరీమణులతో కలిసి పండుగ సంబరాల్లో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.మత సామరస్యం, సోదరభావం, ప్రేమ, శాంతి సందేశాలను చాటిచెప్పే క్రిస్మస్ వేడుకలను అందరి సహకారంతో ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు.



ఐకమత్యంతో పార్టీ అభివృద్ధికి బాటలు వేయాలి

బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావు

ఎల్బీనగర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) భారతీయ జనతా పార్టీ తెలంగాణ లేబర్ సెల్ కార్మిక విభాగంలో లీగల్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా జి.ఎన్.ఎస్.ఎస్. ప్రసాద్ నియమితులయ్యారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రామచంద్ర రావు ఈ నియామకాన్ని ప్రకటిస్తూ నియామక పత్రాన్ని అందజేశారు. పార్టీ సిద్ధాంతాల పట్ల నిబద్ధత, కార్మికుల సంక్షేమం కోసం చేస్తున్న కృషిని గుర్తించి ఈ బాధ్యతలు అప్పగించినట్లు తెలిపారు. కార్మికుల సంక్షేమానికి, పార్టీ బలోపేతానికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక విభాగం రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ సూర్యాపేట జిల్లా కార్మిక సెల్ కన్వీనర్ పాలకుర్తి శేషగిరిరావు బిజెపి సీనియర్ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు



కృత్రిమ రంగులు లేని హిమాలయన్ రాక్ సాల్ట్

హైదరాబాద్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) : సహజ సిద్ధమైన ఆహార పదార్థాల వినియోగంపై ప్రజల్లో అవగాహన పెరుగుతున్న నేపథ్యంలో హిమాలయన్ రాక్ సాల్ట్‌కు ఆదరణ పెరుగుతోందని టాటా సాల్ట్ సంస్థ ప్రతినిధులు బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వారు మాట్లాడుతూ టాటా సాల్ట్ హిమాలయన్ రాక్ సాల్ట్‌లో పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం వంటి సహజ ఖనిజాలు స్వల్ప పరిమాణంలో ఉంటాయని తెలిపారు. ఈ ఉప్పుకు సహజంగా వివిధ రంగులు రావడానికి అందులోని ఖనిజ కణాలే కారణమని పేర్కొన్నారు. ఉప్పును నీటిలో కరిగించి వడపోస్తే నీటిలో కరగని రంగు కణాలు ఫిల్టర్‌పై మిగిలిపోతాయని తెలిపారు. ఇటీవల నిర్వహించిన ప్రయోగశాల పరీక్షల్లో తమ ఉత్పత్తిలో కృత్రిమ ఆహార రంగులు లేవని, సంబంధిత నాణ్యత, భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా ఉన్నట్లు నిర్ధారణ అయిందని వెల్లడించారు. వంటల్లోనూ, వంటకాలకు చివరగా ప్రత్యేక రుచి అందించేందుకూ హిమాలయన్ రాక్ సాల్ట్‌ను ఉపయోగించవచ్చని తెలిపారు. సహజ ఖనిజాల ఉనికితో పాటు టాటా బ్రాండ్ నాణ్యతపై వినియోగదారులకు నమ్మకం కల్పించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana.
Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com

నేడు నీటిని కాపాడితేనే.. రేపటి తరాలకు జీవనాధారం

సామాజిక విశ్లేషకులు పాలకుర్తి శేషగిరిరావు

ఎల్బీనగర్ నవంబర్ 18 (ప్రజా జ్యోతి) వాతావరణ మార్పులతో పెరుగుతున్న నీటి కష్టాలు.. ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టుకోవాల్సిన సమయం ఆసన్నమైంది!

ప్రకృతి వైపరీత్యాలు, వాతావరణ మార్పులు, ఎల్‌నినో ప్రభావం వంటి పరిణామాలు పర్యావరణ సమతుల్యతను దెబ్బతీస్తున్నాయి. సకాలంలో వర్షాలు కురవకపోవడం, కురిసిన వర్షాలు కూడా భూగర్భ జలాలను పెంచే విధంగా ఉపయోగపడకపోవడంతో నీటి వనరులు క్రమంగా తగ్గిపోతున్నాయి. ఫలితంగా అనేక ప్రాంతాల్లో మంచినీటి అవసరాలు తీర్చుకోవడం సవాలుగా మారుతోంది.

ఒకప్పుడు కాలానుగుణంగా వర్షాలు కురిసి చెరువులు, కుంటలు, బావులు నీటితో కళకళలాడేవి. కానీ ప్రస్తుతం ఎండాకాలంలో ఎండల తీవ్రత, వర్షాకాలంలోనూ వర్షాల కొరత, చలికాలంలోనూ అసాధారణ ఉష్ణోగ్రతలు ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. మారుతున్న వాతావరణ పరిస్థితులు భవిష్యత్తులో నీటి సంక్షోభం మరింత తీవ్రమయ్యే ప్రమాదాన్ని సూచిస్తున్నాయి. లినీరు ప్రకృతి ప్రసాదించిన అమూల్యమైన సంపద.లి అది ఉన్నప్పుడు దాని విలువ తెలియదు.. లేనప్పుడు దాని కోసం పడే ఇబ్బందులు వర్ణనాతీతం. అందుకే నీటిని వృథా చేయకుండా పొదుపుగా వినియోగించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా గుర్తించాలి.

ఇంట్లో కుళాయిల నుంచి నీరు వృథాగా పోకుండా చూడటం, వర్షపు నీటిని ఒడిసిపట్టేలా ఇంకుడు గుంతలు నిర్మించడం, చెరువులు, కుంటలను పరిరక్షించడం, మొక్కలు నాటడం, భూగర్భ జలాల పెంపునకు కృషి చేయడం వంటి చర్యలను ప్రతి ఒక్కరూ అలవాటుగా మార్చుకోవాలి.ప్రభుత్వాలు చేపట్టే నీటి సంరక్షణ కార్యక్రమాలకు ప్రజలు కూడా సహకరించాలి. నీటి విలువను పిల్లలకు చిన్నప్పటి నుంచే తెలియజేయాలి. ఎందుకంటే నీటిని ఆదా చేయడం అంటే కేవలం నేటి అవసరాలను తీర్చుకోవడం మాత్రమే కాదు.. రేపటి తరాల భవిష్యత్తును కాపాడటం కూడా"గుర్తుంచుకుందాం.. నీరు లేనిదే జీవం లేదు.. నీటి సంరక్షణ లేనిదే భవిష్యత్తు లేదు!

ప్రతి నీటి చుక్కను విలువైనదిగా భావిద్దాం. నీటిని వృథా చేయకుండా కాపాడుకుందాం. వర్షపు నీటిని ఒడిసిపట్టి భూగర్భ జలాలను పెంచుదాం. సమిష్టి కృషితో నీటి కష్టాలను అధిగమిద్దాం.


పాలకుర్తి శేషగిరిరావు సామాజిక విశేషకులు

కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో నూతనంగా మరో 6,685 మందికి పింఛన్ల మంజూరు -- ఘనంగా పంపిణీ కార్యక్రమం





కుత్బుల్లాపూర్ నవంబర్ 18(ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం (కాంగ్రెస్) ఆధ్వర్యంలో, కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని కేవీఆర్ గార్డెన్స్ (కొంపల్లి) నందు అర్హులైన నిరుపేదలకు నూతన పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. వృద్ధులు, దివ్యాంగులు, ఇతర కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న నిరుపేదలకు అండగా నిలుస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం నూతనంగా మరో 6,685 మందికి పింఛన్లు మంజూరు చేసింది. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని లిశాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం కొంపల్లిలోని కేవీఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, నూతన పింఛన్ల మంజూరుతో నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భరోసా లభిస్తుందని తెలిపారు నియోజకవర్గ పరిధిలోని చింతల్ - 1,657, దుండిగల్ - 793, గాజులరామారం - 1,214, కొంపల్లి - 1,465, నిజాంపేట మున్సిపల్ పరిధిలో 520, కుత్బుల్లాపూర్ - 1,036, మందికి నూతనంగా పింఛన్లు మంజూరైనట్లు వెల్లడించారు. డిసెంబర్ నెల నుండి, 6,685 మంది లబ్ధిదారుల ఖాతాలకు పెన్షన్ అందనుంది.ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ (ఐఏఎస్) , డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్ , కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్ రెడ్డి , మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ , మేడ్చల్ జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నే రాజు , జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ అధ్యక్షులు, డీసీసీ కమిటీ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, మైనారిటీ, ఎస్సీ, ఎస్టీ, ఐ న్ టీ యూ సి , న్ ఎస్ యూ ఐ నాయకులు, కార్యకర్తలు మరియు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ఆపద వేళ.. రూ.5 లక్షల అండ!

పతి కుటుంబానికీ ఇందిరమ్మ జీవిత బీమా భరోసా
చేవెళ్ల మున్సిపాలిటీలో పథకం అమలుకు సర్వం సిద్ధం
కుటుంబంలో సంపాదించే ఒకరికి రూ.5 లక్షల బీమా
రేషన్ కార్డు లేనివారికీ దరఖాస్తు చేసుకునే వెసులుబాటు
ప్రతి వార్డులో ప్రత్యేక శిబిరాలు.. హెల్ప్‌డెస్క్‌ల ఏర్పాటు
నవంబర్ 21 నుంచి వార్డుల వారీగా నమోదు
డిసెంబర్ 18తో ముగియనున్న దరఖాస్తుల స్వీకరణ







చేవెళ్ల, నవంబర్ 18 (ప్రజా జ్యోతి): కుటుంబానికి పెద్దదిక్కుగా ఉన్న వ్యక్తి అనుకోని ప్రమాదానికి గురైతే ఆ కుటుంబం పరిస్థితి ఏమిటి? జీవనాధారం కోల్పోయి ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయే కుటుంబాలకు భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం 'ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం' కు శ్రీకారం చుట్టింది. ఈ పథకం కింద ప్రతి అర్హ కుటుంబంలో సంపాదించే ఒకరికి రూ.5 లక్షల జీవిత బీమా కల్పించనున్నారు. ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాన్ని అర్హులైన ప్రతి కుటుంబానికి చేరవేయాలనే లక్ష్యంతో చేవెళ్ల మున్సిపాలిటీ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఒక్కరికి బీమా.. కుటుంబానికి భరోసా!

కుటుంబంలో సంపాదించే వ్యక్తికి జీవిత బీమా కల్పించడం ద్వారా ఆపద సమయంలో కుటుంబానికి ఆర్థిక అండ అందించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశం. 18 నుంచి 59 ఏళ్ల వయస్సు కలిగిన వారు అర్హులు. 19-11-1967 నుంచి 18-11-2008 మధ్య జన్మించిన వారు వయోపరిమితి పరిధిలోకి వస్తారు. ప్రతి కుటుంబంలో సంపాదించే ఒకరి పేరిట రూ.5 లక్షల బీమా సౌకర్యం కల్పించనున్నారు.

ప్రతి వార్డులో ప్రత్యేక క్యాంపులు!

పథకం నమోదు కోసం చేవెళ్ల మున్సిపాలిటీలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయనున్నారు. ఆయా వార్డుల్లోని కుటుంబాల సంఖ్యకు అనుగుణంగా దరఖాస్తు కౌంటర్లు అందుబాటులో ఉంచనున్నారు. ప్రతి క్యాంపునకు ఒక వార్డు అధికారిని ఇన్‌ఛార్జిగా నియమించడంతోపాటు కంప్యూటర్లు, ప్రింటర్లు, స్కానర్లు, ఇంటర్నెట్ సదుపాయాలు కల్పిస్తున్నారు. డేటా ఎంట్రీ ఆపరేటర్లు, మెప్మా స్వయం సహాయక సంఘాల సభ్యులు, వాలంటీర్ల సేవలను వినియోగించుకోనున్నారు. ప్రజలకు అవసరమైన సమాచారం అందించేందుకు ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లను ఏర్పాటు చేస్తున్నారు.

రేషన్ కార్డు లేకున్నా అవకాశం!

రేషన్ కార్డు లేని అర్హులైన కుటుంబాలు కూడా పథకం కోసం దరఖాస్తు చేసుకునేలా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆహార భద్రత కార్డుల డేటా ఆధారంగా వివరాల నమోదు చేపట్టనుండగా.. కార్డులు లేని అర్హుల కోసం ప్రత్యేక దరఖాస్తు ఫారాలను శిబిరాల్లో అందుబాటులో ఉంచనున్నారు. దీంతో అర్హులైన కుటుంబాలకు పథకంలో భాగస్వామ్యం కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

19న సీఎం చేతుల మీదుగా శ్రీకారం

ఈ నెల 19న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రస్థాయిలో పథకాన్ని ప్రారంభించనున్నారు. అనంతరం నవంబర్ 20న చేవెళ్ల నియోజకవర్గ స్థాయి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని చేవెళ్లలోని కేజీఆర్ గార్డెన్స్‌లో ఎమ్మెల్యే కాలె యాదయ్య నిర్వహించనున్నారు. తదుపరి వార్డుల స్థాయిలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమవుతుంది.

వార్డుల వారీగా తేదీలు ఇవే..

మొదటి విడత (నవంబర్ 21--డిసెంబర్ 3): 5, 6, 7, 8, 12, 14, 15, 16, 17, 18వ వార్డుల్లో దరఖాస్తులు స్వీకరిస్తారు.

రెండో విడత (డిసెంబర్ 4--18): 1, 2, 3, 4, 9, 10, 11, 13వ వార్డుల్లో నమోదు ప్రక్రియ కొనసాగుతుంది.

ఆధార్.. నామినీ వివరాలు తప్పనిసరి

దరఖాస్తు సమయంలో ఆధార్ కార్డు ఆధారంగా పుట్టిన తేదీ, కుటుంబ వివరాలు, నామినీ వివరాలను సమర్పించాల్సి ఉంటుంది. నవంబర్ 19 నుంచి డిసెంబర్ 18, 2026 వరకు నమోదు ప్రక్రియ కొనసాగనుంది. అర్హులు నిర్దిష్ట గడువులోగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

అర్హులందరికీ పథకం చేరాలి

చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమత వెంకట్ రెడ్డి, కమిషనర్ బి. యాదగిరి కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అన్ని వార్డుల్లో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి అర్హత గల కుటుంబం తమ సమీప వార్డు శిబిరాన్ని సందర్శించి గడువులోగా నమోదు చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

అవగాహన సమావేశం.. పోస్టర్ ఆవిష్కరణ

ఇందిరమ్మ కుటుంబ జీవిత బీమా పథకం అమలుపై చేవెళ్ల మున్సిపల్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. మున్సిపల్ ప్రత్యేక అధికారి పద్మావతి, జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ పాల్గొని పథకం అమలు, ఏర్పాట్లపై సమీక్షించారు. అనంతరం పథకానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. మున్సిపాలిటీ పరిధిలోని అర్హులైన ప్రతి కుటుంబం ఈ అవకాశం వినియోగించుకోవాలని కోరారు.

మద్యాన్ని కల్తీ చేస్తున్న వ్యక్తి అరెస్ట్

లిక్కర్ మార్ట్ ను సీజ్ ఎక్సైజ్ డిటిఎస్ టీం.



శేరిలింగంపల్లి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): ఓ జి లిక్కర్ మార్ట్ లో మద్యం అమ్మకాలు జరపకుండా లిక్కర్ మూతలు తీసి బాటిల్లో మద్యం కొద్దిపాటిగా తీసి, తీసిన మద్యానికి బదులు,నీటిని చీప్ లిక్కర్ను కలిపి అమ్మకాలు జరుపుతున్న మద్యం షాపు యజమాని గంధం ప్రవీణ్ గౌడ్ ను ఎక్సైజ్ డిటిఎఫ్ సిబ్బంది నిజాంపేట్ లో పట్టుకున్నారు.వివిధ రకాలైనటువంటి ప్రీమియం మీడియం లిక్కర్లో ఈ కల్తీ చేస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేశారు.వివిధ రకాలైనటువంటి మద్యం బాటిల్లను కల్తీ చేస్తున్నటువంటి వాటిని సీజ్ చేసి వాటిని, నిందితుడిని నిజాంపేట్ ఎక్సైజ్ స్టేషన్లో అప్పగించినట్లు డిటిఎఫ్ సీఐ వెంకట్ రెడ్డి ఎస్ఐ

ఉప్పల్‌లో చైన్ స్నాచింగ్.. బంగారు గొలుసు, సెల్‌ఫోన్ అపహరణ



బైక్‌పై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని దుండగుల చేతివాటం.1.5 తులాల బంగారు గొలుసు చోరీ

ఉప్పల్, నవంబర్ 18, (ప్రజాజ్యోతి): ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చైన్ స్నాచర్లు మరోసారి రెచ్చిపోయారు. హబ్సిగూడ రోడ్డులోని ఎన్టీఆర్ఐ సమీపంలో రోడ్డు దాటుతున్న వ్యక్తిని లక్ష్యంగా చేసుకున్న ఇద్దరు దుండగులు ఆయన మెడలోని సుమారు ఒకటిన్నర తులాల బంగారు గొలుసుతో పాటు సెల్‌ఫోన్‌ను అపహరించి పరారయ్యారు.వివరాల్లోకి వెళితే.. ఉప్పల్ స్ట్రీట్ నంబర్ 8కు చెందిన మురళిబాబు బుధవారం ఉదయం 5.40 గంటల సమయంలో ఎన్ జి ఆర్ ఐ సమీపంలో రోడ్డు దాటుతున్నాడు. అదే సమయంలో ద్విచక్రవాహనంపై వచ్చిన ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు అకస్మాత్తుగా ఆయన వద్దకు చేరుకుని మెడలోని బంగారు గొలుసును, సెల్‌ఫోన్‌ను బలవంతంగా లాక్కొని వేగంగా అక్కడి నుంచి పారిపోయారు. దుండగులు తార్నాక వైపు వెళ్లినట్లు బాధితుడు తెలిపాడు.ఈ ఘటనపై బాధితుడు మురళిబాబు ఉప్పల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఉదయం వేళల్లో జరిగిన ఈ చోరీ ఘటన స్థానికంగా కలకలం రేపింది.

కొంపల్లిలో చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే

కుత్బుల్లాపూర్ నవంబర్ 18(ప్రజా జ్యోతి)



కొంపల్లిలోని కేవీఆర్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన చేయూత పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వారితో పాటు స్థానిక కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ పాల్గొన్నారు ఈ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి 6,700, రాష్ట్రవ్యాప్తంగా 5 లక్షల చేయూత పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం అర్హులైన పేదలు, వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులకు అండగా నిలుస్తూ సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, డీసీసీ అధ్యక్షులు వజ్రేష్ యాదవ్, ఇన్‌చార్జ్ హనుమంత్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి..!

కొత్తూరు ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఉపేందర్



నందిగామ, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): కొత్తూరు మండల కేంద్రంలోని జహంగీర్ పీర్ దర్గా రోడ్డులో బైపాస్ పక్కన ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ వాహన తనకీలు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఉపేందర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి, లైసెన్సు లేకుండా వాహనం నడిపితే, మద్యం తాగి నడిపితే కఠిన చర్యలు తప్పవు ప్రమాదం జరిగిన తర్వాత బాధపడే కంటే ముందే జాగ్రత్తగా ఉండడం మంచిది మీ ప్రాణం, కుటుంబం మీ చేతుల్లోనే ఉంది అని పోలీసులు వాహనదారులకు

ఐఎఫ్ఎఫ్ఐ-2026లో మెరిసిన హిమాలయ కథలు: లదాఖ్, కాశ్మీర్ చిత్రాలకు ప్రత్యేక గుర్తింపు

లదాఖ్‌లోని గడ్డకట్టిన మంచుపై ఓ యువ స్కేటర్ కన్న కలలు... గుల్మార్గ్ చిన్నారుల జీవితాలు... శ్రీనగర్‌లోని ఆఖరి తరం దారుశిల్ప కళాకారుల కథలతో హిమాలయాల స్ఫూర్తిని గోవాకు పరిచయం చేస్తున్న నాలుగు చిత్రాలు

హిమాలయ ప్రాంతపు పర్వతాలు, బౌద్ధ మఠాలు, మంచుతో కప్పి ఉన్న గ్రామాలు, సజీవ హస్తకళలు గోవాలో జరుగుతున్న 57వ భారత అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (ఐఎఫ్ఎఫ్ఐ) వేదికగా ఆవిష్కృతం కానున్నాయి. లదాఖీ, కాశ్మీరీ భాషల్లో తెరకెక్కిన రెండు ఫీచర్, రెండు నాన్-ఫీచర్ చిత్రాలు అక్కడి ప్రకృతి అందాలను, సంప్రదాయాలను, సామాన్యుల జీవిత కథలను ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నాయి. ముఖ్యంగా... ఇండియన్ పనోరమా నాన్-ఫీచర్ విభాగంలో ప్రారంభ చిత్రంగా ప్రదర్శించనున్న లదాఖీ లఘుచిత్రం 'బికమింగ్' ఈ ప్రత్యేక ప్రదర్శనకు నాంది పలకనుంది.

లదాఖీ చిత్రాలు:

లీనా యాదవ్ రచన, దర్శకత్వంలో రూపొందిన 11 నిమిషాల లదాఖీ లఘు చిత్రం 'బికమింగ్'... ఇండియన్ పనోరమా నాన్-ఫీచర్ విభాగంలో ప్రారంభ చిత్రంగా ప్రదర్శితమవుతోంది. లదాఖ్ నేపథ్యంలో సాగే ఈ కథ... రిన్‌చెన్ అనే యువ తల్లి, పసితనం నుంచే ప్రకృతితో విడదీయరాని అనుబంధాన్ని కలిగి ఉన్న ఆమె కుమారుడు అగ్యల్ చుట్టూ తిరుగుతుంది. ఏడేళ్ల వయసులో అగ్యల్‌కు వింత దృశ్యాలు కనిపించడం, పురాతన లికిర్ బౌద్ధ మఠం వైపు ఆకర్షితుడవడం, గత జన్మకు సంబంధించిన జ్ఞాపకాలు గుర్తుకురావడం జరుగుతుంది. ఆ మఠంలోని ఒక తాళం వేసిన గదిలో గల పెట్టెను అగ్యల్ గుర్తించడంతో, అందులోని వస్తువులను చూసిన బౌద్ధ సన్యాసులు అతడిని ఒక గౌరవనీయ 'రింపోచే' పునర్జన్మగా విశ్వసిస్తారు. అగ్యల్ ఆధ్యాత్మిక ప్రయాణం మొదలయ్యే క్రమంలో పునర్జన్మ, విధి, గతం-




వర్తమానం-భవిష్యత్తుల మధ్య సంబంధాలను ఈ చిత్రం అద్భుతంగా ఆవిష్కరిస్తుంది. రిన్‌చెన్ ఆంగ్మో, త్సెరింగ్ వాంగ్‌గైల్ ఇందులో నటించారు. 'పార్చ్డ్', 'రాజ్మా చావల్', 'హౌస్ ఆఫ్ సీక్రెట్స్' వంటి పురస్కార చిత్రాలతో పాటు ఆస్కార్ కోసం నామినేట్ అయిన 'టెల్ ఇట్ లైక్ ఎ ఉమెన్' చిత్రానికి పనిచేసిన ప్రముఖ దర్శకురాలు, నిర్మాత లీనా యాదవ్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు. సాహిల్ షా దర్శకత్వంలో రూపొందిన 85 నిమిషాల లదాఖీ ఫీచర్ ఫిల్మ్ 'బర్ఫ్ ఆన్ ఐస్'... ఇండియన్ పనోరమా ఫీచర్ ఫిల్మ్ విభాగంతో పాటు ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు కేటగిరీకి ఎంపికైంది. గొర్రెల కాపరులైన తన తల్లిదండ్రుల రాక కోసం ఎదురుచూస్తూ... తాతయ్య వద్ద పెరుగుతున్న తాషి అనే లదాఖ్ బాలిక చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఒకరి వద్ద నుంచి అరువు తెచ్చుకున్న ఐస్-హాకీ స్కేట్స్ ఆమె చేతికి అందడంతో ఆమెలో ఓ కొత్త కల మొలకెత్తుతుంది. కఠినమైన హిమాలయ చలికాలంలో ఎదుగుతున్న క్రమంలో... కుటుంబం, విషాదం, మనుగడకు సంబంధించిన చేదు నిజాలను తాషి తెలుసుకుంటుంది. అయినప్పటికీ వెనకడుగు వేయకుండా, తన ప్రాణ స్నేహితుడితో కలిసి తన కలను సాకారం చేసుకునేందుకు ఆమె తనదైన మార్గాన్ని ఎంచుకుంటుంది. తాషి పాత్రలో సెమ్జాంగ్ స్కిట్‌డన్ నటించగా... ఎన్. చోపాల్, కుంగా చోస్క్యాబ్, పద్మ చోరోల్, సోనమ్ స్టోబ్‌గైస్ ఇతర ముఖ్య పాత్రలు పోషించారు. షాన్ పస్రీచా రచన చేయగా, కామియో ఫిల్మ్స్ నిర్మించింది. ఐస్-హాకీ క్రీడాకారుల స్ఫూర్తితో సాహిల్ షా దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిల్మ్ ఇది.

కాశ్మీరీ చిత్రాలు:

రాజా షబీర్ మహమ్మద్ ఖాన్ దర్శకత్వంలో రూపొందిన 75 నిమిషాల కాశ్మీరీ ఫీచర్ ఫిల్మ్ 'స్లేడ్జ్'... ఐఎఫ్ఎఫ్ఐ-2026 వేదికపై ఆసియా ప్రీమియర్‌గా ప్రదర్శితం కానుంది. ఇండియన్ పనోరమా విభాగంలో చోటు దక్కించుకున్న ఈ చిత్రం... భారతీయ చిత్రాల విభాగంలో ఉత్తమ తొలి చిత్ర దర్శకుడు పురస్కారం కోసం పోటీపడుతోంది. గుల్మార్గ్ సమీపంలోని ఓ మంచుతో కప్పి ఉండే గ్రామంలో నివసించే అలీ కుటుంబానికి మంచుపై లాగే ఓ బండి మాత్రమే ఏకైక జీవనాధారం. అలీ కొన్ని రోజుల పాటు ఇంటి నుంచి బయటకు వెళ్లిన సమయంలో... అతడి ముగ్గురు పిల్లలైన హాజిక్, ఈషెల్, రైమా ఆడుకుంటూ అనుకోకుండా ఆ బండిని విరగ్గొడతారు. తండ్రి తిరిగి వచ్చేలోపు దానిని బాగు చేయించాలనే తాపత్రయంతో ఆ చిన్నారులు గుల్మార్గ్ పర్యాటక ప్రాంతంలో డబ్బు సంపాదించేందుకు ప్రయత్నిస్తారు. ఈ క్రమంలో ఎన్నో తిరస్కారాలను, నిశ్శబ్ద అవమానాలను ఎదుర్కొంటారు. సరిగ్గా అప్పుడే వారికి డబ్బు, చాక్లెట్లతో నిండిన బ్యాగ్ దొరుకుతుంది. తమ సమస్యకు పరిష్కారం దొరికిందనుకునే లోపే... ఆ డబ్బును వాడుకోవాలనే ఆశకు, తమ అంతరాత్మకు మధ్య ఆ పిల్లలు నలిగిపోతారు. రాజా ఖాన్... సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇనిస్టిట్యూట్ పూర్వ విద్యార్థి. గతంలో ఆయన రూపొందించిన 'షెపర్డ్స్ ఆఫ్ పారడైజ్' డాక్యుమెంటరీకి జాతీయ పురస్కారం లభించింది. రిహానా ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ చిత్రంలో హాజిక్ మహమ్మద్ ఖాన్, ఈషెల్ ఖాన్, రైమా ఖాన్ ప్రధాన పాత్రలు పోషించారు.

ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ కారుకు యాక్సిడెంట్

తృటిలో తప్పిన పెను ప్రమాదం.. ఇద్దరికి స్వల్ప గాయాలు.



కొత్తూరు నవంబర్ 18 (ప్రజా జ్యోతి) తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ స్వల్ప గాయాలు అయ్యాయి. ఈ సంఘటన కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో బుధవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. కొత్తూరు సీఐ బి. నాగార్జున రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ బల్మూరి వెంకట్ తన భార్య ఇందూజ, తమ్ముడు చాణక్య రెడ్డితో కలిసి ఇన్నోవా కారులో దైవదర్శనానికని తిరుపతి వెళ్లారు. శ్రీవారిని దర్శించుకుని తిరిగి హైదరాబాద్‌కు వస్తుండగా మార్గమధ్యంలోని కొత్తూరు మున్సిపాలిటీ పరిధిలో జహంగీర్ పీర్ దర్గా కూడలి, బైపాస్ రోడ్డు వద్దకు చేరుకోగానే కేశంపేట వైపు నుంచి కోళ్ల లోడుతో కొత్తూరు పట్టణంలోకి వెళ్లేందుకు రోడ్డు దాటుతున్న మినీ డీసీఎం వ్యాను ఎమ్మెల్సీ ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఎమ్మెల్సీ తోపాటు ఆయన భార్యకు పెను ప్రమాదం తప్పింది. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. కారులో ముందు కూర్చున్న తన తమ్ముడు చాణక్య రెడ్డి, డ్రైవర్ నవీన్ రెడ్డిలకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ విషయం తెలుసుకున్న ఎస్ హెచ్ఓ నాగార్జున రెడ్డి పోలీసు సిబ్బందితో హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం షాద్నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించారు. డీసీఎం డ్రైవర్ నాగేష్ ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కి తరలించారు. చాణక్య రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు సీఐ వివరించారు. డీసీఎం డ్రైవర్ నిర్లక్ష్యం వహించి అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగి ఉంటుందని ఆయన అనుమానం వ్యక్తం చేశారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్

రాజేంద్రనగర్ నియోజకవర్గంలో చేయూత పెన్షన్ పథకం ద్వారా 4,392 మంది లబ్ధిదారులకు పెన్షన్ ప్రొసీడింగ్స్ ను అందచేసిన ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్







రాజేంద్రనగర్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని అని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ అన్నారు. రంగారెడ్డి జిల్లా రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని రాజేంద్రనగర్, గండిపేట్, శంషాబాద్ మండలాలకు చెందిన 4,392 మంది లబ్ధిదారులకు బుధవారం రాజేంద్రనగర్ లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, నార్సింగి డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి, రాజేంద్రనగర్ డిప్యూటీ కమిషనర్ సురేందర్ రెడ్డి, శంషాబాద్ డిప్యూటీ కమిషనర్ సుమన్ రావు, శంషాబాద్ మండలం తహసిల్దార్ అమరలింగం గౌడ్, రాజేంద్రనగర్ మండలం తాసిల్దార్ బొమ్మ రాములు అధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చేయూత పెన్షన్స్ ప్రోసిడింగ్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ వితంతువులకు, వృద్ధులకు, వికలాంగులకు, నా అనేవాళ్ళు లేని వారి కోసం ప్రభుత్వం ఎప్పుడూ ఆలోచిస్తూ వారికి అండగా నిలుస్తుంది అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం లో ఇప్పటికే వేల మందికి పెన్షన్లు ఇవ్వడం జరుగుతుందని అదనంగా 4, 392 మందికి ఇవ్వడం సంతోషకరమైన విషయం అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు , తెల్ల రేషన్ కార్డులు, ఉపాధి కోసం రుణాలు , మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు ఇలా అనేక పథకాలను చేపడుతున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అన్నారు. రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి, తహసిల్దార్ బొమ్మ రాములు లు మాట్లాడుతూ, అత్తాపూర్ సర్కిల్ లో 1,901 మందికి, రాజేంద్రనగర్ సర్కిల్ లో 771, నార్సింగి లో 281, మనికొండ లో 263, శంషాబాద్ మండలంలో 652, శంషాబాద్ పట్టణంలో 524 మందికి నూతనంగా పెన్షన్ ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో శంషాబాద్ ఎంపిడీఓ మున్నిసర్పంచులు, మాజీ కార్పొరేటర్లు, మాజీ కౌన్సిలర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధిగా చాకలి మహేష్ నియామకం

రాష్ట్రంలోని యువతకు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడుతా

రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధి చాకలి మహేష్

రాజేంద్రనగర్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) రాష్ట్రంలోని యువతకు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలపై పోరాడుతా అని రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధి చాకలి మహేష్ పేర్కొన్నారు. భారతీయ జనతా యువమోర్చా రంగారెడ్డి జిల్లా అధికార ప్రతినిధిగా శంషాబాద్ కు చెందిన చాకలి మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విద్యార్థి దశ నుంచే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో చురుగ్గా పనిచేస్తూ విద్యార్థి సమస్యలపై నిరంతరం పోరాడిన ఆయన సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఈ కీలక బాధ్యతలను అప్పగించింది చాకలి మహేష్ విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలతో ఎదిగారు. 2016లో కళాశాల అధ్యక్షుడిగా ఎన్నికై, అనంతరం శంషాబాద్ కేంద్రంగా విద్యార్థుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారు. అంచెలంచెలుగా ఎదుగుతూ జిల్లా, రాష్ట్ర స్థాయిలో ఏబీవీపీలో కీలక బాధ్యతలు నిర్వర్తించారు. తదుపరి శంషాబాద్ (రంగారెడ్డి) జిల్లా కన్వీనర్ గా సమర్థవంతంగా పనిచేశారు. ప్రస్తుతం యువతకు ఆదర్శంగా నిలుస్తూ, నిరుద్యోగుల పక్షాన గళమెత్తేందుకు రంగారెడ్డి జిల్లా బీజేవైఎం అధికార ప్రతినిధిగా ఏకగ్రీవంగా నియమితులయ్యారు.

ఈ సందర్భంగా చాకలి మహేష్ మాట్లాడుతూ

రాష్ట్రంలోని యువతకు, నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలను ప్రశ్నించే గొంతుకగా పనిచేస్తానని తెలిపారు. నిరుద్యోగులకు తక్షణమే ఉద్యోగ అవకాశాలు కల్పించాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌లను వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో అభివృద్ధి పేరుతో ఏర్పాటవుతున్న పరిశ్రమలు, కంపెనీలలో స్థానిక యువతకు ప్రాధాన్యత ఇస్తూ మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు.తనపై నమ్మకంతో ఈ కీలక బాధ్యతలు అప్పగించిన బీజేపీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు , తెలంగాణ బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షులు, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు, మండల అధ్యక్షులు,



రాష్ట్ర, జిల్లా, మండల నాయకులకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

బీఎస్పీ చేవెళ్ల పార్లమెంట్ ఇంచార్జీగా అడ్వకేట్ సతీష్

నియామక ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్

బహుజన ఉద్యమ బలోపేతమే లక్ష్యం



చేవెళ్ల నవంబర్ 18 (ప్రజా జ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) చేవెళ్ల పార్లమెంట్ నూతన ఇన్‌చార్జిగా అడ్వకేట్ గ్యార సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఇబ్రాం శేఖర్ శనివారం నియామక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ జాతీయ అధ్యక్షురాలు కుమారి మాయావతి నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయడంతోపాటు, బహుజన ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడం, పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ నియామకం చేపట్టినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. సెంట్రల్ సెక్టార్ ఇన్‌చార్జిలు, మాజీ ఎమ్మెల్సీ అతర్ సింగ్ రావు, సురేష్ ఆర్య ఆదేశాల మేరకు, రాష్ట్ర ఇన్‌చార్జి బి. చంద్రశేఖర్ సమాచారంతో ఈ నియామకం జరిగినట్లు పేర్కొన్నారు. జోన్-4 చీఫ్ జోన్ ఇన్‌చార్జి పర్యవేక్షణలో సతీష్ పార్టీ బాధ్యతలను నిర్వహించనున్నారు. చేవెళ్ల పార్లమెంట్ పరిధిలో బీఎస్పీని మరింత విస్తరించడం, బహుజన వర్గాలను ఏకతాటిపైకి తీసుకురావడం, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడమే లక్ష్యంగా పనిచేస్తానని సతీష్ తెలిపారు.

జర్నలిస్టుల సమస్యలపై టీజేఏ రాష్ట్ర కార్యవర్గ సమావేశం



హైదరాబాద్, నవంబర్ 18 (ప్రజా జ్యోతి) : తెలంగాణ జర్నలిస్ట్స్ అసోసియేషన్(టీజేఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశం బుధవారం రవీంద్ర భారతిలో రాష్ట్ర అధ్యక్షుడు రమణారావు అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మాజీ సభ్యుడు ఉప్పల లక్ష్మణ్ మాట్లాడుతూ అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు లేదా ఇళ్లు త్వరగా కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. టీజేఏకు ప్రభుత్వ గుర్తింపు ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వానికి రమణారావు కృతజ్ఞతలు తెలిపారు. ప్రతి జిల్లాలో యూనియన్‌ను బలోపేతం చేయాలని జనరల్ సెక్రటరీ గోరి పిలుపునిచ్చారు. ఎన్‌యూజేఐ ఉపాధ్యక్షులు రాజేంద్రనాథ్, ఖలీల్, ఖాసీం, రాజలింగం, సత్నం సింగ్, వివిధ జిల్లాల అక్రిడిటేషన్ కమిటీ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు. జర్నలిస్టుల సంక్షేమం, విద్య, వైద్యం, ఇళ్ల స్థలాలు, గృహాల సమస్యలతో పాటు జనవరిలో నిర్వహించనున్న రాష్ట్ర, జిల్లా సార్వత్రిక ఎన్నికలపై చర్చించారు.

బుధారపు మహిపాల్ రెడ్డి 3వ వర్ధంతి సందర్భంగా విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌ల పంపిణీ.





మోమిన్ పేట నవంబర్ 18 (ప్రజా జ్యోతి) మోమిన్‌పేట మండల పరిధిలోని అమ్రాది ఖుర్ద్ గ్రామానికి చెందిన బుధారపు మహిపాల్ రెడ్డి 3వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన జ్ఞాపకార్థం అమ్రాదికుర్ద గ్రామంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాల విద్యార్థులకు బుధవారం ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్‌లను పంపిణీ చేశారు. మహిపాల్ రెడ్డి కుమారుడు బుధారపు బుచ్చిరెడ్డి తన తండ్రి జ్ఞాపకార్థం ఈ కార్యక్రమాన్ని నిర్వహించి విద్యార్థులకు స్పోర్ట్స్ డ్రెస్‌లను అందజేశారు. ఈ సందర్భంగా విద్యార్థులను ప్రోత్సహించేందుకు ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం అనంతరం బుధవారం బుచ్చిరెడ్డి నీ విద్యార్థుల తల్లిదండ్రులు అభినందించారు. తన తండ్రి జ్ఞాపకార్థం విద్యార్థులకు ఉచితంగా స్పోర్ట్స్ డ్రెస్ పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆయనను శాలువాలకు ఘనంగా సన్మానించారు తన తండ్రి జ్ఞాపకం ఇటువంటి సేవా కార్యక్రమం చేపట్టి నందుకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పట్లోళ్ళ పురుషోత్తం రెడ్డి, ఉపసర్పంచ్ ప్రకాష్, వార్డు సభ్యులు షకీల్, బాలరాజు, మాజీ సర్పంచ్ మైబల్లి, గ్రామ పెద్దలు అంజయ్య, మల్లేశం, శేఖర్ గౌడ్, పుండరికం, ప్రేమ నందం, జగన్ మోహన్ రెడ్డి,రవి స్వామి,శేఖర్, శ్రీనివాస్ గౌడ్,మహమ్మద్ గని, ప్రకాశం పంతులు,రియాజ్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.
ఫోటో రైట్ అప్
మార్నింగ్ పేట ఫోటో.

పెన్షన్ పత్రాల కోసం 8 గంటల నిరీక్షణ.. ఆకలితో అరటిపండ్లే ఆధారం!

వృద్ధులు,వితంతువులు,దివ్యాంగులకు కనీస భోజన సదుపాయం కరువు.. ఎమ్మెల్యే రాక కోసం గంటల తరబడి ఎదురుచూపులు!





చౌడాపూర్ మండల్ (ప్రజా జ్యోతి) నవంబర్ 18 : వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన చేయూత పెన్షన్ మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం లబ్ధిదారులకు తీవ్ర ఇబ్బందులను మిగిల్చింది.వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ.రామ్మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకావాల్సి ఉండగా,ఆయన రాక ఆలస్యం కావడంతో వివిధ గ్రామాల నుంచి వచ్చిన లబ్ధిదారులు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.భోజనాలు లేవు.అరటిపండ్లే దిక్కు మండలంలోని వివిధ గ్రామాల నుంచి వచ్చిన వృద్ధులు,వితంతువులు ,వికలాంగులు,మహిళలకు కనీసం భోజన సదుపాయం కూడా ఏర్పాటు చేయకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.ఆకలితో అలమటించిన కొందరు కాంగ్రెస్ పార్టీ నాయకులు లబ్ధిదారులు సమీపంలోని సంతలో అరటిపండ్లు కొనుగోలు చేసుకొని తింటూ పెన్షన్ మంజూరు పత్రాల కోసం ఎదురుచూశారు.ప్రభుత్వ పథకం ద్వారా తమకు లబ్ధి చేకూరుతుందని ఆశతో వచ్చిన పేద ప్రజలకు కనీసం మంచినీరు,భోజనం వంటి సౌకర్యాలు కల్పించకపోవడంపై పలువురు అసహనం వ్యక్తం చేశారు.ప్రజల సమయం.ఆరోగ్యం పట్టించుకునేది ఎవరు వయస్సు పైబడిన వృద్ధులు,నడవలేని దివ్యాంగులు,వితంతువులు గంటల తరబడి కార్యక్రమ ప్రాంగణంలో వేచి ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆకలితో నిరీక్షించడం ఎంతవరకు సమంజసమని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.కార్యక్రమానికి వచ్చే లబ్ధిదారుల సంఖ్య ముందుగానే తెలిసినప్పటికీ కనీస ఏర్పాట్లు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఎప్పుడు మారుతుంది సమయపాలన చౌడాపూర్ మండల కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాలకు పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ. రామ్మోహన్ రెడ్డి సమయపాలన పాటించడం లేదని స్థానిక ప్రజలు విమర్శిస్తున్నారు.ప్రజాప్రతినిధులు నిర్వహించే కార్యక్రమాల్లో ప్రజల విలువైన సమయాన్ని గుర్తించాలని,ముఖ్యంగా వృద్ధులు,దివ్యాంగులు,మహిళల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ముందస్తు ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.పెన్షన్ అనేది పేదలకు జీవనాధారం..అలాంటి పెన్షన్ పత్రాల కోసం వచ్చిన వారిని గంటల తరబడి నిరీక్షింపజేసి,కనీసం భోజన సదుపాయం కూడా కల్పించకపోవడం బాధాకరమని పలువురు లబ్ధిదారులు తమ ఆవేదనను వ్యక్తం చేశారు.ఇకపై ఇలాంటి కార్యక్రమాల్లో సమయపాలనతో పాటు లబ్ధిదారులకు తగిన సౌకర్యాలు కల్పించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.



అస్వస్థతకు గురైన విద్యార్థులను పరామర్శించిన బీఆర్ఎస్ నాయకులు



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా.. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని భరోసా

పరిగి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): పరిగి మండలం ఇబ్రహీంపూర్ తండాలోని రూప్‌సింగ్ నాయక్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఉన్న అడవి ఆముదం కాయలు తిని అస్వస్థతకు గురై పరిగి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తొమ్మిది మంది విద్యార్థులను బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో వైద్యులను కలిసి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు. బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని భరోసా కల్పించారు. విద్యార్థులు పూర్తిస్థాయిలో కోలుకునే వరకు వారికి, వారి కుటుంబాలకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని నాయకులు స్పష్టం చేశారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు తోడుగా నిలుస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మాజీ ఎంపిపి అరవింద్ రావు, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ప్రవీణ్ రెడ్డి కౌన్సిలర్లు శివనోళ్ళ భాస్కర్, మీదిగడ్డ శ్రీనివాస్, రవికుమార్, అనేం ఆంజనేయులు బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



ప్రాథమిక పాఠశాల మిట్ట కోడూర్ లో ఘనంగా బాలల దినోత్సవం





పరిగి, నవంబర్ 18 (ప్రజాజ్యోతి): విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకత నైపుణ్యాలను వెలికి తీయడానికి ప్రభుత్వ పాఠశాలలోని ఉపాధ్యాయులు నిరంతరం కృషి చేస్తున్నారని మిట్ట కోడూరు గ్రామ సర్పంచ్ పి మాణిక్యం తెలియజేశారు. బుధవారం నాడు ప్రాథమిక పాఠశాల మిట్ట కోడూరు లో ప్రధానోపాధ్యాయులు ఎండి ఉస్మాన్ అలీ అధ్యక్షతన బాలల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఇట్టి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గ్రామ సర్పంచ్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ అనిత రాణి మాట్లాడుతూ విద్యార్థుల విద్యా ప్రగతి కోసం ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేస్తున్నారని తెలియజేశారు. బుధవారం పండిత్ జవహర్ లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా పాఠశాలలో బాలల దినోత్సవం కార్యక్రమం లో భాగంగా స్వయం పరిపాలన దినోత్సవంలో భాగంగా మండల విద్యాధికారిగా కుమారి ఎం శిరీష , ప్రధానోపాధ్యాయులుగా దీపక్ వారి పాత్రల్లో చక్కని ప్రతిభతో కనిపించారు. ఉపాధ్యాయులుగా తెలుగు, ఆంగ్లము, గణితము, పరిసరాల విజ్ఞాన శాస్త్రముల బోధనలో విద్యార్థులు ఒకరోజు ఉపాధ్యాయులుగా వారి వారి పాత్రల్లో లీనమై చక్కని ప్రతిభా కనబరిచిన విద్యార్థినీ విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏ కృష్ణయ్య, వివిఎన్ నర్సింలు, రాజు, కవిత, ప్రీ ప్రైమరీ తరగతుల టీచర్స్ మనీలా, విజయ రాణి, గ్రామ కార్యదర్శి బాల్ కిషన్,విద్యార్థినీ విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై విద్యార్థుల్లో అవగాహనకు క్విజ్, వ్యాసరచన పోటీలు

ఉత్సాహంగా పాల్గొన్న 102 మంది విద్యార్థులు
విజేతలకు కలెక్టర్ చేతుల మీదుగా బహుమతుల ప్రదానం






వికారాబాద్ ప్రతినిధి, నవంబర్ 18(ప్రజా జ్యోతి): జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో, నోడల్ అధికారి ఎం.ఏ. సత్తార్ అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో ఎస్ వి ఈఈ పి (ఈ ఎల్ సి ఎస్) కార్యక్రమంలో భాగంగా క్విజ్, వ్యాసరచన పోటీలను నిర్వహించారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి మొత్తం 102 మంది విద్యార్థులు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు ప్రాధాన్యత, ఎన్నికల ప్రక్రియపై విద్యార్థుల్లో అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా ఈ పోటీలను నిర్వహించారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలను అందజేశారు. జూనియర్, సెకండరీ, హయ్యర్ సెకండరీ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, ఏ సి జి ఈ, జిల్లా విద్యాశాఖ కార్యాలయ సిబ్బంది, ఐదు అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రిలియంట్ కాన్వెంట్ స్కూల్లో స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలు

ఉపాధ్యాయులుగా మారి పాఠాలు బోధించిన విద్యార్థులు



బషీరాబాద్, నవంబర్ 18, ప్రజా జ్యోతి: వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండల కేంద్రంలోని బ్రిలియంట్ కాన్వెంట్ స్కూల్లో బుధవారం స్వయం పరిపాలన దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఒక్కరోజు ఉపాధ్యాయులుగా, ప్రధానోపాధ్యాయులుగా బాధ్యతలు చేపట్టి వివిధ సబ్జెక్టులకు సంబంధించిన పాఠాలను తరగతి గదుల్లో బోధించారు. ఉపాధ్యాయుల పాత్రను పోషిస్తూ విద్యార్థులు తమ బోధనా ప్రతిభను చాటుకున్నారు.వివిధ సబ్జెక్టుల్లో అత్యుత్తమంగా బోధించిన విద్యార్థులను ఎంపిక చేసి మొదటి, రెండవ, మూడవ స్థానాల్లో నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ మాట్లాడుతూ, స్వయం పరిపాలన దినోత్సవం ద్వారా విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, ఆత్మవిశ్వాసం, బాధ్యతాయుత భావం పెంపొందుతాయని తెలిపారు. ఉపాధ్యాయులుగా ఒక్కరోజు బాధ్యతలు నిర్వహించడం ద్వారా బోధనా విధానంపై అవగాహన పెరుగుతుందని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజశేఖర్ ఉపాధ్యాయులు రాజు కుమార్ సుజాత సవిత నాగమణి రేఖ మౌనిక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



అయ్యప్ప భక్తి నేపథ్యంలో వైభవ్ ‘హరిహర పుత్ర’.. ఆకట్టుకుంటున్న టీజర్!

టాలెంటెడ్ హీరో వైభవ్ ప్రధాన పాత్రలో నటిస్తున్న తాజా చిత్రం ‘హరిహర పుత్ర’ బ్లాక్‌బస్టర్ సినిమా ‘మాళిగాపురం’ ఫేమ్ విష్ణు శశి శంకర్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. స్వామి అయ్యప్ప భక్తి, ఆధ్యాత్మికత మరియు ఉత్కంఠభరితమైన రహస్యాల నేపథ్యంలో తెరకెక్కుతున్న ఈ సినిమా తెలుగు టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ఈ చిత్రంలో వైభవ్ పూర్తి భక్తిభావంతో కూడిన అయ్యప్ప భక్తుడిగా నటిస్తుండగా, ఆయన సరసన మీనాక్షి గోవిందరాజన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. వీరితో పాటు ఆడుకాలం నరేన్, అరవింద్ ఆకాష్ తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. ఈ చిత్రంలో రవి మోహన్, మిర్చి శివ, వెంకట్ ప్రభు, కృష్ణ, మహత్, ప్రేమ్‌జీ అమరన్ మరియు గంగై అమరన్ వంటి ప్రముఖులు ప్రత్యేక పాత్రల్లో నటిస్తున్నారు. తంత్రా ఫిలింస్ పతాకంపై జె.కె. శరవణ, ఎం. రాజారామ్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ప్రముఖ దర్శకుడు వెంకట్ ప్రభు దీనికి క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమాకు ప్రేమ్‌జీ అమరన్ సంగీతం అందిస్తుండగా, ప్రవీణ్ కె.ఎల్. ఎడిటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



బ్లాక్ డ్రెస్‌లో మౌనీ రాయ్ గ్లామర్ షో.. చూపు తిప్పుకోలేరు!

